POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఏప్రిల్ 2025
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 42 సంచిక: 12



పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ ఆరాధనా మహోత్సవము

(04.04.2025 - తిథి) ~ (12.04.2025)

## ఈ నెల పండుగలు

ఏప్రిల్ 04 - పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ ఆరాధనా మహోత్సవము (తిథి-చైత్ర శుద్ధ సప్తమి)

ఏప్రిల్ 06 - శ్రీరామ నవమి

ఏప్రిల్ 06 - శ్రీ సిద్ధారూఢ స్వామి జయంతి (తిథి-చైత్రశుద్ధ నవమి)

ఏప్రిల్ 12 - పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ ఆరాధన

ఏప్రిల్ 26 - శ్రీ స్వామిసమర్థ ఆరాధన (చైత్ర బహుళ త్రయోదశి)

ఏప్రిల్ 30 - శ్రీ ఆనందమయి మాత జయంతి

# పూజ్య గురుదంపతుల లీలా కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకలు - 2025

మార్చి 4వ తేదీ నుండి ౯వ తేదీ వరకు ఒంగోలులోను, శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము, గుమ్మళంపాడు లోను పూజ్య గురుదంపతుల లీలా కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు, గురుపుత్రిక శ్రీమతి వేదవతిగారు కుటుంబ సమేతంగా ఈ వేడుకలలో పాల్గొన్నారు. అనేక ప్రాంతాల నుండి వచ్చిన భక్త జనులందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఈ వేడుకలలో పాల్గొన్నారు.





# రామాయణంలో గురు సాంప్రదాయం

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ధర్మమనేది కేవలం శాస్త్ర గ్రంథాలు చదువుకొన్నంత మాత్రానే తెలిసేదిగాదు. దానిని ఆచరణలో పెట్టేటప్పుడు నిత్య జీవితంలో శతకోటి సందేహాలు వస్తాయి. అప్పుడెలా నిర్ణయించుకోవాలో, ఏంచేస్తే ధర్మమవుతుందో తెలుసుకోవడం ఎంతో కష్టము. అది తెలియాలంటే దానిని ఆచరణలో పెట్టగలిగిన మహాత్ముల చెంతన సేవిస్తూ వుండవలసిందే. ధర్మాచరణమన్నది మహాత్ములను చూచి నేర్చుకోవలసిందే. మహాత్ములు చేసినది ఎలా ధర్మమో మనకు తెలియకపోతే వారిని అడిగి – అంటే పరిప్రశ్న చేసి తెలిసికోవలసిందే. నిజానికి యిలా చేసాకనే ఆధ్యాత్మ విద్య గురించి పరిప్రశ్న చేసే అధికారము వస్తుంది. ఇలా ఎన్నడూ ధర్మాన్ని తప్పకుండా అనుక్షణం ఆచరిస్తూ వుండడం అన్నది స్వభావసిద్ధమై పోవాలి. అపుడు మాత్రమే మనలోని మానవత్వం సంపూర్ణం అవుతుంది. అటు తర్వాతనే దైవత్వము, లేక ఆధ్యాత్మికత సాధ్యమవుతుంది. ఇటువంటి అవకాశము అందరికీ ఎల్లప్పుడూ లభించదు. కనుకనే వీలైనంతవరకు ప్రజలకు యిట్టి సౌలభ్యం చేకూర్చడానికి, ధర్మాన్ని అనుక్షణమూ పాటించిన శ్రీరామచంద్రుని వృత్తాంతము వీలైనంత వివరంగా వ్రాసి వాల్మీకి మహర్షి మనకు అందించారు. అందుకే, “రామో విగ్రహవాన్ ధర్మః” అని ఆయన చెప్పాడు. “మానవాకృతిలో వున్న ధర్మమే రాముడు” అని అర్థము.

అంటే శ్రీరాముడు ఏమి చేసినందువలన ఉత్తముడైన మానవుడు అయ్యాడో అది తెలిసికొని మనమూ అలానే చెయ్యాలని వాల్మీకి మొదలైన మహర్షుల భావము. శ్రీరాముడు మొదట్లో చేసినదేమి? అంతవరకూ కేవలం తండ్రిచాటు బిడ్డగా వున్న రాముణ్ణి, తనతో యాగ రక్షణకు పంపమని విశ్వామిత్ర మహర్షి దశరథుడిని కోరాడు. దశరథునికి మహర్షులయందు ఎంతో విశ్వాసము, విధేయత వుండేవి. కాని తన కొడుకు విషయంలో మాత్రం మనందరిలాగనే, మమకారం అడ్డు వచ్చింది. ఎన్నెన్నో సాకులు చెప్పి, శ్రీరాముని పంపకుండా చూడాలనుకొన్నాడు.

అపుడు గురువు, బ్రహ్మజ్ఞానీయైన వశిష్ఠుడు ఆదేశించడంవలన మాత్రమే శ్రీరాముని యాగరక్షణకు పంపాడు. ‘భగవంతుని భజించమని చెప్పే తండ్రే తండ్రి’ అన్నట్లు, నిజంగా బిడ్డల శ్రేయస్సునుకోరే తండ్రే తన బిడ్డల విషయంలో తన మమకారంకంటే



ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 ఏప్రిల్ - 2025 సంచిక:12

*పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"*

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | రామాయణంలో గురు సాంప్రదాయం | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి రాజ్యలక్ష్మి | 13 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 15 |
| 06. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 07. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 18 |
| 08. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 20 |
| 09. | గురు దంపతుల లీలా కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకలు | శ్రీమతి టి. పద్మావతి | 22 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ జుబ్బురు చెన్నారావు | 26 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | డాక్టర్ ప్రసాదరావు | 28 |


**చిరునామా**
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**
విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

బ్రహ్మజ్ఞానియైన గురువు చెప్పినదానికే ప్రాధాన్యత యివ్వాలని మనము తెలిసికోవాలి. పామరదృష్టితో చూస్తే, అలా చేసినందువల్లనే శ్రీరామునికెన్నో కష్టాలు వచ్చాయి. విశ్వామిత్రుడు చేస్తున్న యాగాన్ని పాడుచేయజూచిన రాక్షసులను అతడు చంపడం వల్లనే వారికి అతనిపై ద్వేషం కలిగింది. మనవలె యిందుకు వెరచి దశరథుడు శ్రీరాముణ్ణి పంపకుంటే అతడు విశ్వామిత్రుణ్ణి సేవించి ధర్మము, అస్త్రశస్త్రాలు నేర్చుకోగల్గేవాడు కాదు. ముందు ముందు కైకేయి కోరికననుసరించి అతడు అరణ్యానికి వెళ్లినపుడు రావణుడు సీతను అపహరిస్తే, యుద్ధంలో అతనిని ఓడించి సీతను పొందగల్గేవాడు కాదు. కనుక



దశరథుడు తనకెంత యిష్టం లేకపోయినా తన గురువు చెప్పినట్లు వినడమెంతో మేలైంది. ఇది రామాయణంనుండి మొదట మనము తెలిసికోవలసిన అంశము.

అంతేకాదు మనము ఆశ్రయించవలసినది బ్రహ్మజ్ఞానియైన గురువును మాత్రమే! బ్రహ్మజ్ఞానం లేనివారికి యిష్టాయిష్టాలు వుంటాయి. అట్టి వారిని ఆశ్రయిస్తే, మనము మన యిష్టాయిష్టాలకు బలి అయ్యే బదులు, అట్టి బోధక గురువు యొక్క యిష్టాయిష్టాలకు బలియవుతాముగాని, ఎట్టి శ్రేయస్సూ జరుగదు. విశ్వామిత్రుడు బ్రహ్మజ్ఞాని గనుకనే, అతని సేవకు శ్రీరాముడిని పంపమని వశిష్ఠ మహర్షి ఆదేశించాడు. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అనడానికి గుర్తు, ఆయనగూడ మూర్తీభవించిన ధర్మస్వరూపమై యుండడమే, ఆ విషయం వాల్మీకి స్పష్టంగా వ్రాసాడు. శ్రీరాముడు రాక్షసులను సంహరించగలిగింది గూడ విశ్వామిత్రుని అనుగ్రహం వల్లనేనని వశిష్ఠుడు చెప్పిన వివరం వాల్మీకి ఎంతో జాగ్రత్తగా వ్రాసాడు. విశ్వామిత్రుడు గూడ, "ఈ రాముడు నా గుప్తమైన రక్షణలో, తన స్వతేజస్సుతో దుర్మార్గులైన రాక్షసులందరినీ నాశనం చేయ సమర్థుడు. ఈ రామునికి ముల్లోకాలలోను ఖ్యాతి కల్గేలా అనేక రీతుల శ్రేయస్సును ప్రసాదిస్తాను" అని (బాలకాండ 19: 9, 10) చెప్పాడు.

వశిష్ఠుడు యింకా స్పష్టంగా, "ఈ రాముడు అస్త్రశస్త్రాలలో సమర్థుడైనా కాకపోయినా, విశ్వామిత్రుని రక్షణలో వున్నంతవరకూ అతనిని రాక్షసులు ఏమీ చేయలేరు. విశ్వామిత్రుడు మానవాకృతి ధరించిన ధర్మమే. నీ కొడుకులకు మేలు చేయడానికే నిన్నిలా అడుగుతున్నాడు" అని చెప్పాడు.

శ్రీసాయిబాబాకు వారి గురువిచ్చిన అభయము సరిగ్గా యిలాగే 'గుప్తమైనది'. శ్రీ సాయి మనకిచ్చే అభయంగూడ అలాంటిదే. అట్టి విశ్వాసంతో మనము గూడా కష్టాలకు వెరవక, ధర్మం కోసం పోరాడాలని శ్రీసాయి భావం. ఇంతటికీ మూలం – శ్రీరాముడు ఆశ్రయించిన విశ్వామిత్రుని గురించి వాల్మీకి, వశిష్ఠుడు గూడ, 'ఏష విగ్రహవాన్ ధర్మః' – 'ఈయన మూర్తీభవించిన ధర్మమే!' అన్న వాక్యమే. రామాయణంగూడ శ్రీసాయి చెప్పిన సద్గురు సేవయే శ్రీరామునియంతటి అవతారపురుషునికి గూడ ఆచరణీయమైన మార్గమని చెబుతున్నది. ఇలా చేస్తేనే శ్రీరామనవమి పండుగ సార్థకమవుతుంది. ●

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## ప్రశ్న :- కొందరు సాయి, అక్కల్కోట స్వామి వంటి వారు చెప్పేది ప్రామాణికం కాదని, శృతులే ప్రమాణమనీ అంటున్నారు, మీ సమాధానమేమిటి ?

**- పి.వి.రామారావు, రాజమండ్రి**

**జవాబు :-** నీ మిత్రులకు శృతులే ప్రమాణమన్నావు. అది నిజమైతే భగవద్గీతలో కృష్ణుడు పరమ భక్తునికీ, తనకూ భేదం లేదన్నాడు. జ్ఞాని సాక్షాత్తు తానేనన్నాడు. అపుడు పూర్ణజ్ఞాని, పూర్ణభక్తుడూ భగవత్స్వరూపులేనని శ్రీ కృష్ణుడు చెప్పినట్లే. అట్టివారిని సేవించి పరిప్రశ్న చేసి శరణుపొంది జ్ఞానాన్ని పొందమన్నాడు. కృష్ణుడు ప్రమాణమైతే ఆయన చెప్పినదీ ప్రమాణమే. ఆ భావాన్నే గురువు త్రిమూర్తి స్వరూపియని, పరబ్రహ్మ స్వరూపియని శాస్త్రాలు చెప్పాయి. అందుకే శ్రీకృష్ణుడు సాందీపని మహర్షిని ఆశ్రయించేటప్పుడు ఆయన పేరు వేదాలలో వున్నదా లేదా అనిగాని ఆయన గురించి పురాణమున్నదా అనిగాని అడుగలేదు. రాముడు గూడ వశిష్ఠ, విశ్వామిత్రుల గురించి అట్టి విచికిత్స చేయకనే ఆశ్రయించాడు. మరే మహర్షులు తమ గురువుల గురించి అట్టి విచికిత్స చేసినట్లు చూడము. అప్పుడీ మీమాంస మన యిష్టాయిష్టాలకు సంబంధించినదేగానీ ప్రమాణికముగాదు. ధర్మానికీ, ఆధ్యాత్మికతకూ మన యిష్టాయిష్టాలు ప్రమాణాలు కాజాలవు. శాస్త్రవిధిని విడచి నడచుకొన్నవాడికి సిద్ధి కల్గదని శ్రీకృష్ణుని శాసనము.

ఇక శృతియైన తైత్తరీయోపనిషత్తులోని నారాయణ ప్రశ్నలోని 80 అనువాకం జీవన్ముక్తుని దేహము, చేష్టలే మహాయజ్ఞమని ఘంటాపథంగా యిలా చెబుతున్నది – (మూలం 'తస్యైవం విదుషో' మొదలు 'ఎతర్వై' అనే నాలుగవ మంత్రం వరకు) "అతని ఆత్మయే యజమానుడు; శ్రద్ధయే అతని పత్ని, శరీరము ఇధ్మము, ఉరస్సు వేది; రోమములు దర్భలు; శిఖ వేదము, హృదయము రూపము, కామము ఆజ్యము, కోపము పశువు, తపస్సే అగ్ని; దమమే దక్షిణ; వాక్కే హూత; ప్రాణమే ఉద్గాత; నేత్రమే ఆధ్వర్యుడు, శ్రోత్రము అగ్నీధ్రుడు; అతడు భుజించని సమయమే దీక్ష; భుజించుట హవిస్సు; జలపానమే సోమపానము; క్రీడ ఉపసదిష్టలు. తిరగడం, కూర్చొనడం, నిలుచొనడం ప్రపర్యము; ముఖము అవహనీయాగ్ని, మాట్లాడుట ఆహుతి, విజ్ఞానమే హోమము; సాయం పాతఃకాల భోజనం సమిధలు."

శృతి వేరొకచోట ఈ యజ్ఞాంగాలను పరమాత్మరూపంగా వర్ణించింది. అలాంటి జీవన్ముక్తుడు భగవంతుడన్నమాట. యజ్ఞవరాహమూర్తిని యజ్ఞ స్వరూపంగా వర్ణించిన పురాణ వచనాలు గూడ దీనినే సూచిస్తున్నాయి. 'యజ్ఞోవైవిష్ణుః' అని మంత్రము. అందుకే విష్ణు సహస్రనామంలో పరమాత్మ యజ్ఞముగా వర్ణించబడటం గమనార్హం. ఇదంతా ప్రమాణం కాదనుకొంటే అసలు ప్రమాణమేలేదు.

శ్రీ శంకర భగవత్పాదులు మొదలైన ప్రాచీన సాంప్రదాయ ప్రవర్తకులు గూడ గురు ప్రార్థనతో తమ గ్రంథాలు ఆరంభించడం గమనించాలి. అంతేగాదు ఆత్మజ్ఞానము పొందిన వారెవరైనా తమకు గురుతుల్యులేనని గూడ శంకరులన్నారు. అలానే యితర సాంప్రదాయ ప్రవర్తకులందరూ గురుభక్తి ప్రధానులు. ఇక దానిని కాదనడానికి మనమెంతవారము? ●

*(అక్టోబర్ 2013 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి చెప్పాలంటే ఏమని చెప్పగలము? ఎంతని చెప్పగలము? ఆయనను అంచనా వేయడంలో మన పాత్ర ఎంత స్వల్పము? ఆయన మహాసముద్రము వంటివారు అనుకుంటే అందులోని అలలవంటి వాళ్ళమైన మనం సముద్రం గురించి పూర్తిగా తెలుసుకొనగలమా? అలాగే ఆయన వ్యక్తిత్వం మన స్వల్ప మేధస్సుకు అసలు అందుతుందా అన్నది అనుమానమే.

ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన పరిపూర్ణ మానవుడు అంటే సరిపోతుందేమో! కారణం దానిలోనే ఆయనలోని గుణాలన్నీ యిమిడి వున్నాయి గనుక. పరిపూర్ణ మానవునిలో వుండే ధర్మగుణము, దయ, శాంతి, క్షమ, ప్రేమ, ధీరత్వము... ఇంకా ఎన్నో సద్గుణాలు ఆయనలో వున్నాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారికి చిన్నప్పుడే మాతృవియోగం సంభవించడంలో జీవితంలో మొట్టమొదటి దెబ్బ తగిలింది. దానితో ఆయనలో అప్పుడే నిరాశ, నిస్పృహ, స్తబ్దత చోటుచేసుకొన్నాయి. తర్వాత గూడ దాని నుండి ఆయన పూర్తిగా కోలుకోలేదనే అనిపిస్తుంది. తర్వాత దెబ్బ మీద దెబ్బ అన్నట్లు అన్నగారి కుమారుని మరణంతో అణగివున్న ఆయన అన్వేషణ మేల్కొనడమే గాక, తీవ్రతరమైంది. సత్యాన్ని తెలుసుకునేదాకా ఆ అన్వేషణ ఆయనను నిద్రపోనివ్వలేదు. అట్టి అన్వేషణలో భాగంగా అనేక ప్రశ్నలుద్భవించడమే గాక, ఒకానొక రోజున సమాధానం దొరకడం గూడ సంభవించింది. ఆ తర్వాత ఆయన సమర్థ సద్గురువైన సాయినాథుని దర్శనానికి వెళ్ళడము, శ్రీసాయిబాబా పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆత్మానుభవము ప్రసాదించడము అందరికీ తెలిసిన విషయమే.

అయితే ఎంతోమందికి అట్టి జ్ఞానం సాధన ద్వారాగాని, పూర్ణపురుషుల అనుగ్రహం వల్లగానీ కలిగివుండవచ్చు. అయితే అట్టి జ్ఞానం కలిగినవారు ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వుంటారు. వారి చర్యలు, బోధలు గూడ వేర్వేరుగానే వుంటాయి. అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారి బోధనాదక్షత, వారి వ్యక్తిత్వము చాలా భిన్నంగా వుంటాయి. అంటే ఆయన వ్యక్తిత్వం మామూలుగా వున్నట్లు పైకి కన్పించినప్పటికీ ఆయన చేసే ప్రతి చిన్నపనీ గూడ ప్రత్యేకంగా వుండి మనకు ఏదో ఒక బోధ చేస్తూనే వుంటుంది. ఇక ఆయన బోధనాదక్షత ఎంతటిదో చెప్పడం ఎవరికీ సాధ్యంకాదు. ఆయన చెప్పే ప్రతి విషయము నిత్య జీవితంలో మనము ఎదుర్కొనే వ్యక్తుల, సంఘటనలకు పరిష్కార మార్గం సూచిస్తూంటుంది. వాటిని ఆయన మనకు బోధించడం మాత్రమేగాక, అవి మనలను ఆలోచింపజేసేవిగా వుంటాయి. అంటే ఒక విధంగా ఆయన మనకు ఆలోచనా విధానాన్ని బోధిస్తున్నారన్నమాట. ఎలాగంటే ఒక లెక్కకు సమాధానం చెప్పడము, లేక చేసి చూపించడము గాక, ఆ లెక్కని ఎలా చేయాలో నేర్పితే అప్పుడు మనం ఎన్ని లెక్కలనైనా చేయగలుగుతాము. అలా వుంటుంది ఆయన బోధ. కనుక మనకు జీవితంలో వచ్చే సమస్యలకు పరిష్కారాన్ని ఎలా ఆలోచించాలో నేర్పడంవల్ల

ఎటువంటి పరిస్థితులను ఎలా పరిష్కరించుకోవాలో మనకు తెలుస్తుంది గదా! అట్టి ఆలోచనా విధానాన్ని తెలుపడం ఆయనలోని ప్రత్యేకత.

సంతోషంలోను, దుఃఖంలోనూ ఎలా ఆలోచిస్తే మనం సుఖాలకు పొంగని, దుఃఖాలకు కృంగని మానసిక స్థితిని చేరుకోగలుగుతామో అట్టి కీలకమైన ఆలోచనా పద్ధతిని నేర్పుతారాయన. అందుకని ఆయన బోధనలను మనం ఆచరించగలిగితే ఎంతటి భక్తులకు, యోగులకు, తపస్వులకూ సాధ్యంగాని అసలైన పారమార్థికత మనకు లభిస్తుంది. ఇంతకంటే ఎవరైనా పొందవలసిన ఆధ్యాత్మికత ఏమున్నది? అందుకని ఆయన బోధనాదక్షత అసామాన్యమనే చెప్పాలి.

ఇక జ్ఞాన విజ్ఞాన సమన్వయంలో ఆయన కాయనయే సాటి. నాస్తిక, హేతువాదులకు వచ్చే ప్రశ్నలను, అనుమానాలను ఆయనే వేసుకుని, వాటికి సమాధానాన్ని తమ వివేచన ద్వారా పొందగలిగారు గనుక వాటి సమన్వయాన్ని ఆయన చక్కగా వివరించగలరు. ఇది ఆయనలోని మరొక విశిష్టత.

సకల జీవుల పట్ల ఆయనకున్న కరుణ అపారము. తమ వద్దకు వచ్చిన ప్రతివారికి అత్యుత్తమ శ్రేయస్సు చేకూర్చడానికి ఆయనపడే తపన చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. ఒకప్పుడు తమకు సన్నిహితంగా వుండి తర్వాత తమకు వ్యతిరేకమైనవారి పట్ల కూడా ఆయన కరుణ చూస్తుంటే కళ్ళు చెమర్చకమానవు.

ఎవరు తమను ఎటువంటి ప్రశ్నలు వేసినా ఆయన ఓర్పుతో సమాధానం చెప్పేవారు. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ళ వరకు, అజ్ఞానుల నుంచి జ్ఞానార్థులవరకు, ఆకతాయతనంగా వుండే యువకులనుంచి, వెటకారంగా మాట్లాడే వ్యతిరేకుల వరకూ ఆయనను అడిగే ప్రశ్నలకు ఎంతో ఓర్పుతో సమాధానం చెప్పేవారు. ఉదాహరణకు 'భగవంతుడు వున్నాడా? వుంటే ఎలా వుంటాడు?' అన్న పెద్ద పెద్ద ప్రశ్నలు వేసేవారికి, 'మీరెందుకు సిగరెట్లు తాగుతున్నారు? స్వామి ఇచ్చినా తర్వాత మానెయ్యవచ్చుకదా!' అని ఎగతాళిగా ప్రశ్నలు వేసేవారికి 'మీరు వ్రాసే శ్రీసాయిలీలామృతము ప్రతిసారీ ఎందుకు మార్పులు చేస్తున్నారు? డబ్బు సంపాదించుకోడానికా?' అని నిలదీసేవారికి ఆయన ఎవరి మానసిక స్థాయికి అర్థమయ్యేరీతిలో వారికి తగినట్లుగా చిరునవ్వుతోను, జోక్‌గానూ సమాధానం చెప్పేవారు. ఇటువంటి ప్రశ్నలు నా అంతటివాణ్ణి వేయడమేమిటి? అన్న అహంకారం ఆయనలో మచ్చుకైనా కన్పించేది కాదు. 'నీకేంటి సమాధానం చెప్పేది' అని ఆయన ఎన్నడూ అనేవారు కాదు.

చాలామంది గురువులు భక్తులకు అంత చనువును యివ్వరు. అందుకని గురువులను ఏమి ప్రశ్నించాలన్నా ఏమంటారోనని, అడగవచ్చో, అడగకూడదోననీ వారు భయపడుతూ వుంటారు. గురువులు గూడ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్తారు. కొన్నింటికి చెప్పరు. కొన్నింటికి కోప్పడతారు. అంతెందుకు? వారి దగ్గర నుంచోడానికి గాని, కూర్చోడానికి గానీ శిష్యులకు భయమే.

కానీ పూజ్యశ్రీ మాష్టరుగారి దగ్గర అలా వుండదు. చిన్నవారైనా, పెద్దవారైనా ఎటువంటి మంచి ప్రశ్నవేసినా, చొప్పదంటు ప్రశ్నవేసినా వారు ఎంతో సౌమ్యంగా సమాధానం చెప్పేవారు. అందరూ మనసులు విప్పి మాట్లాడేటట్లుగా వుండేది ఆయన ప్రవర్తన. ఆయన ఎదురుగా కొందరు కాళ్ళు జాపుకుని కూర్చునేవారు. కొందరు సిగరెట్టు త్రాగేవారు కూడ. అయినా ఆయన అవేవీ పట్టించుకునేవారు కాదు.

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారిని కొంతమంది యువకులు అడ్డదిడ్డంగా ప్రశ్నలు వేస్తున్నారు. ఆయన ఎంతో ఓర్పుగా సమాధానం చెబుతున్నారు. అప్పుడు మా మామగారు శ్రీమాన్ అనంతాచార్యులవారు మా వద్దనే వున్నారు. ఆయన గూడ ఆ వాదనలను వింటున్నారు. కొంతసేపటికి ఆయనకు అసహనం పెరిగిపోయింది. సత్సంగహాలు నుంచి గబగబా లోపలకు వచ్చి నాతో, "ఏమిటమ్మా వాళ్ళ పిచ్చి ప్రశ్నలు? వెధవలు, వెధవలు. తెలుసుకోవాలనే జిజ్ఞాసే లేదు. పెడగా ప్రశ్నలు వేయడమే పనిగా పెట్టుకున్నారు. అట్లాంటి వాళ్ళకు సమాధానం చెప్పడమెందుకు? వీడి ఓపికంతా పోవడం తప్ప ప్రయోజనమేమీ వుండదు. నువ్వైనా లోపలకు పిలువమ్మా. లేకపోతే ఆ వాదనలు అలాగే కొనసాగుతూనే వుంటాయి" అన్నారు. అంటే చూసేవారికి, వినేవారికి అలా అనిపించేది. ఎంతసేపైనా వారిని సమాధానపరచి బాగుపరచాలన్నదే

పూజ్యశ్రీ మాస్టరుగారి తాపత్రయం. ఆ తాపత్రయం చూస్తుంటే 'మాతృప్రేమ' అంటే యిదేనేమో అనిపిస్తుంది. పిల్లలు ఎటువంటివారైనా వాళ్ళు బాగుపడాలని చూసే తల్లివలె ఆయన అందరిపట్ల ఎంతో తాపత్రయపడేవారు.

ఇక నా విషయానికొస్తే ఆయన నాకు ఆధ్యాత్మిక శిక్షణను ఎంతగా యిచ్చారో! చిన్న విషయం దగ్గర నుంచి పెద్ద విషయం దాకా ఎలా ఆలోచించాలో ఆయన నాకు బోధిస్తూనే వుండేవారు. చిన్నదైన గొంగళి పురుగును చూసి నేను భయపడుతున్నప్పుడు, 'ఇల్లు శుభ్రంగా లేకపోతే నాకు బాగుండదు' అన్నప్పుడు ఆయన చెప్పిన ఆలోచనా విధానం నా మానసిక స్థాయినే మార్చివేసింది. 'ద్వేషమే కాదు, రాగము కూడా ఆధ్యాత్మికంగా ఆటంకమే' అన్నప్పుడు నాకు చాలా ఆశ్చర్యమేసింది. రాగమెలా ఆటంకమో ఆయన వివరంగా చెప్పారు.

మిన్ను విరిగి మీద పడ్డా మొక్కవోని ధైర్యము, ఆత్మవిశ్వాసము ఆయన స్వంతం. అది ఎన్నో సందర్భాలలో ప్రత్యక్షంగా చూసాను. ఇటువంటి పరిస్థితులలో గూడ యిలా వుండడం సాధ్యమా? అని ఆశ్చర్యపోవడం నావంతయ్యేది. ఆయన తమ జీవితంలో ఎన్నో క్లిష్ట సమస్యలను ఎదుర్కొన్నారు. కానీ అవేవీ నాతో చెప్పకుండా ఏమీ జరుగనట్లే మామూలుగానే వున్న తీరు నన్నెంతో ఆశ్చర్యపరచింది. అవతలి వాళ్ళను అంతగా ప్రేమించగలగడం ఆయనకే సాధ్యమనిపించింది.

"వంతెనపై ఎవరూ ఇల్లు కట్టుకోరు" అన్న ఆయన సూక్తిని గూర్చి ఆలోచిస్తుంటే జీవితంలో ఏది నిలువనిదేనని, నిలిచేది మన ప్రవర్తనేనని, మనం చేసుకునే కర్మలే ఎన్నో జన్మలెత్తడానికి కారణమవుతాయని, ఒకవేళ భోగభాగ్యాలననుభవించే జన్మలొచ్చినప్పటికీ 'ఇది వంతెన మాత్రమే'నని గుర్తుపెట్టుకుని దాటిపోవడానికి అంటే జన్మ పరంపరలను అతిక్రమించడానికి ప్రయత్నించకపోతే మళ్ళీ మళ్ళీ కష్టాలననుభవించే జన్మలెత్తే ప్రమాదం పొంచి వుంటుందనే సత్యాన్ని నాకు బోధపరచింది. అప్పుడు ఏది ఎలా జరిగినా ఏమిటి నష్టం? అన్న ధైర్యం వచ్చింది. ఇలా జరిగితే బాగుండుననే ఆలోచనను తీసివేయడం ఎంతో తేలికగా అనిపించింది. అప్పుడు జీవితంలో ఏది ఎలా జరిగినా చింతపడాల్సిన అవసరం లేదు.

పిల్లల పట్ల ఆయన చూపించే శ్రద్ధ, ప్రేమ మరెవ్వరూ చూపించరేమో! అంతటి పని ఒత్తిడిలోనూ వారి చదువు, ఆరోగ్యము, ఆధ్యాత్మికతకు అవసరమైన బీజాలు వేయడంలో ఆయన సమర్థత అమోఘము.

ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తమకు చేతనైనంత సహాయం చేయడానికి ఆయన ఎప్పుడూ సంసిద్ధులుగా వుండేవారు. ఆపదలలో ఆదుకునేందుకు ఆయన వున్నారనే ధైర్యం ఆయన పరిచయస్తులలో వుండేది. మానవత్వ దృష్టిలో చూస్తే ప్రేమ, దయ, క్షమ, దానము, ధైర్యము, ఆత్మవిశ్వాసము, పెద్దల ఎడల గౌరవము మొదలైన సద్గుణాలన్నీ ఆయనలో వున్నాయి. అందుకే ఆయన పరిపూర్ణ మానవుడు.

ఇక ఆధ్యాత్మిక దృష్టిలో చూస్తే వీటికి తోడు గురుభక్తి, వైరాగ్యము, తత్త్వజ్ఞానము మొదలైనవన్నీ ఆయనలో నిండుగా వున్నాయి.

నాకు ఆయన గురించి వివాహం అయ్యేంతవరకూ పెద్దగా తెలియదు. చాలా మంచివారని, సాయిబాబా భక్తులనీ మాత్రమే తెలుసు. ఆయన దగ్గరకు వచ్చిన తర్వాతనే ఆయన యొక్క గొప్పతనం గురించి అవగతమవుతూ వచ్చింది. రాను రానూ యింకా యింకా తెలుస్తూ వచ్చింది. తర్వాత అంతటి గొప్పవారు మరొకరు వుండరని, వుండబోరనీ స్పష్టంగా తెలిసింది.

ఆయన చెప్పే మాటలను పట్టుకుని వెళ్ళగలిగితే జీవితంలో దుఃఖానికి తావే లేదు అన్నది సత్యం. ఏ విషయంలోనైనా సరే ఆయనలో లోపమెంచడానికి కొంచెం గూడ అవకాశముండదు.

గురుభక్తిపరంగా చూస్తే శిరిడీలో మొదటిసారిగా బాబా తమకు అనుభవము యిచ్చినప్పటి నుండి జీవితాంతము ఆయన స్మరణే తమ శ్వాసగా ఆయన జీవించారు.

ఉత్తమ గురుభక్తుని వలె ఆయన తమ గురువు చెప్పినదానినే ఆచరిస్తూ గురువు తమను ఎలా వుంచితే అలా జీవించారు. ఆయన తమలోని దివ్యశక్తులను ఏనాడూ ప్రకటించుకోలేదు. అప్పుడప్పుడు వాటంతట అవే బయటపడేవి.

ఆయన ఒక్కొక్కప్పుడు ఇతరుల బాధలను తాము

అనుభవించేవారు. ఆ సంగతి గూడ ఎవరికీ తెలియనిచ్చేవారు కాదు. ఒకసారి ఒకతనికి పిరుదుపై గడ్డ (కురుపు) లేచింది. అతడు కూర్చోలేక బాధపడుతున్నాడు. అప్పుడు పూజ్యశ్రీ మాష్టరుగారు అతని, "ఒరేయ్! నీకు ఎక్కడ కురుపులేచిందో అటువైపు నీవు నేలకానించి కూర్చుని ఆ కుండలో నీళ్ళు ఒక గ్లాసెడు తీసుకొచ్చి నాకివ్వు" అన్నారు. విద్యానగర్ లో పూజ్యశ్రీ మాస్టరుగారు కూర్చునే హాలులో వాకిలి ప్రక్కగా అందరూ త్రాగడానికి ఒక కుండలో మంచినీళ్ళు వుంచేవారు. అతడు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లే చేసాడు. ఆ మంచినీళ్ళు పూజ్యశ్రీ మాస్టరుగారు త్రాగారు. వెంటనే అతనికి ఆ కురుపు అణగిపోయింది. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారికి మాత్రం కొద్ది క్షణాలలోనే నుదిటి మీద కురుపు వచ్చింది!

ఎంత పని ఒత్తిడిలో వున్నా మధ్యాహ్న సమయంలో పిల్లలు బడినుంచి వచ్చి భోజనాలు చేసేటప్పుడు ఆయన సాధ్యమైనంత వరకూ పిల్లలతో కలిసి భోజనం చేసేవారు. ఆ సమయంలో వారికి యు.జి.సి కార్యక్రమాలు చూపించేవారు. చి॥వేదవతి డాన్సు ప్రోగ్రామ్ కు ఊళ్ళో వుంటే తప్పకుండా వెళ్ళేవారు. కారణం పిల్లలకు తమ తల్లిదండ్రులు, తమ వాళ్ళు చూసి చాలా బాగుందంటే ఎంతో సంతోషం. పైగా అందరి పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రోగామ్ లు చూడడానికి వస్తారు. నేనెటూవెళ్ళలేను. అందుకని వాళ్ళకు ఆ వెలితి తెలియకుండా ఆయన ప్రయత్నించేవారు. వాళ్ళకు పాఠాలు చెప్పడమే గాక, వాళ్ళతో ఆటలు గూడ ఆడేవారు. ద్వారకకు క్రికెట్ లో మెళకువలు – వేదవతికి డాన్సులోని ఆధ్యాత్మిక తత్త్వం చెప్పేవారు.

బాధ్యతను స్వీకరించి దానిని వందశాతం నిర్వర్తిస్తూ ప్రశాంతంగా వుండడం ఆయన యొక్క ప్రత్యేకత. ఆర్థిక పరిస్థితి ఎంతగా బాగుండకపోయినా తమ ప్రయత్నం తాము చేస్తూ, ఆందోళనపడే విక్రమ్ వాళ్ళకు ధైర్యం చెబుతూ ఎవరినీ, చివరకు తాము సహాయం చేస్తే పైకొచ్చిన వాళ్ళనైనా సరే అప్పుగా కూడా ఏమి అడగకుండా వుండే ఆయన నిశ్చింతను చూసి తీరవలసిందే! మానవత్వంగా చూసినా, భగవంతునిపై భారం వేయడం పరంగా చూసినా అలా ఎవరుండగలరు? అనిపిస్తుంది.

దూషణ, భూషణ, తిరస్కారాలను సమానంగా స్వీకరించడం ఆయనకు మాత్రమే సాధ్యం. "మనలను గురించి ఎవరు ఎప్పుడు ఏమి మాట్లాడినా అది వారి వారి భావాలను బట్టి వుంటుంది. వారి భావాలు మళ్ళీ మరొకరకంగా మారినప్పుడు వారే విపర్యయంగా మాట్లాడవచ్చు. కానీ మనమెలా వున్నామో మనం చూసుకోవాలి. ఎలా వుండాలో ఆలోచించాలి. బాబాకు యిష్టమైనట్లు నేను ప్రవర్తించగలిగితే చాలు. మిగతావాళ్ళు పొగిడినా, తెగిడినా సంతోషించడానికి గాని, బాధపడడానికి గానీ ఏమున్నది?" అనే వారాయన.

ఎవరినైనా ఏదైనా చెయ్యమని బలవంతపెట్టడం ఆయన అభిమతంకాదు. 'అలా చేస్తే హృదయపూర్వకంగా ఎవరూ ఏది చేయలేరు' అని చెప్పేవారాయన. అందుకని ఏ విషయంలోనూ ఎవరినీ ఇది చెయ్యవలసిందేననిగాని, ఇలా చెయ్యవలసిందేనని గానీ చెప్పడం చూడలేదు నేను. నా విషయంలో గూడ అంతే. ఏదీ యిలా చెయ్యమని గాని, వద్దనిగానీ ఆయన చెప్పలేదు. ఏది ఎలా చేస్తే మంచిదో, ఎలా ఆలోచిస్తే మంచిదో మాత్రమే చెప్పేవారు.

మామూలుగా ప్రపంచంలో మనం చూసే చాలామంది గురువుగార్లకుండే భేషజాలు ఆయనకు లేవు. "తాను గురువునని తలచేవాడు గురువుకాడు" అన్నట్లు ఆయన తాము గురువునని ఏనాడూ చెప్పలేదు, తలచలేదు గూడ. అందుకే ఎక్కడికైనా ఎవరితోనైనా, కొద్దిమందితో కావచ్చు. చాలామందితో కావచ్చు – కలిసి వెళ్ళినప్పుడు ఆయనే స్వయంగా అక్కడి ఏర్పాట్లన్నీ చూసేవారు. సామాన్యంగా గురువులను ఎక్కడికైనా తీసుకుని వెళ్ళాలంటే భక్తులు అక్కడ గురువుగారికి ప్రత్యేక ఏర్పాటు చేసి, ప్రత్యేక వాహనంలో వారిని తీసుకువెళ్ళి, వారికి అవసరమైన భోజన సౌకర్యాలు భయభక్తులుతో చేస్తారు. ఎక్కడ వారికి లోపం జరుగుతుందేమోనని, పాపం వస్తుందేమోనని, గురువుగారికి ఆగ్రహం వస్తుందేమోనని చాలా జాగ్రత్తగా వుంటారు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి విషయంలో మాత్రం అది పూర్తి వ్యతిరేకం. భక్తులకే మాస్టరుగారు అన్ని సౌకర్యాలూ చూసేవారు. అంటే ఆయన తమని తాము ఎంతగా తగ్గించుకునే వారో అర్థమవుతుంది. "తమను తాము తగ్గించుకునేవారు హెచ్చింపబడుదురు" అన్న బైబిల్ వాక్యం

ఆయన పట్ల ఎంతగా సరిపోతుందో! "నీ దాసుడను, నీ దాసానుదాసుడను" అన్నదానికి ఆచరణ రూపం ఆయన. ఆయన విశ్వసించినది ఆచరించారు. ఆచరించినదే చెప్పారు. ఆయన తాము ఆచరించనిదేదీ చెప్పలేదు.

ఆయన నిరంతర శ్రామికుడు. కష్టాలు భగవంతుడిచ్చిన వరాలేమో! ఎప్పుడూ ఏదో పని నిర్విరామంగా చేస్తూనే వుండేవారు. "కాస్త విశ్రాంతి తీసుకోవచ్చు గదా!" అని అంటే ఆయన యిలా అనేవారు: "సృష్టిలో సహజమైన దేనికి లేని విశ్రాంతి మనకెందుకు? ఒక పనిలో నుంచి మరొక పనిలోకి వెళ్ళడమే విశ్రాంతి. శరీరానికి విశ్రాంతి చాలా తక్కువ అవసరం. విశ్రాంతి సుఖానికి ప్రతీక. సుఖం బద్ధకానికి దోవతీస్తుంది. అదీగాక సుఖపడడం వల్ల పుణ్యం ఖర్చుయిపోతుంది. బ్యాంక్ బ్యాలెన్స్ (Bank Balance) అయిపోయినట్లే. ఎంతగా శ్రమిస్తామో అంతగా ప్రకృతిలోని ప్రతిజీవి యొక్క ఋణము తీర్చుకుంటాము లేకపోతే ఋణానుబంధాన్ని పెంచుకోవడమే జరిగేది. తిరిగి తిరిగి వాటిని తీర్చుకోవడానికి జన్మలెత్తవలసిందే. దానికి అంతమెక్కడ?" అనేవారు.

ధర్మరక్షణలోను, న్యాయపోరాటంలోనూ ఆయనెన్నడూ వెనుకంజ వేయలేదు. ప్రేమించినవారు విభిన్నకులాల, మతస్థులవారైనప్పటికీ వారికి వివాహం చేయడం శాస్త్ర సమ్మతమని ఆయన చెప్పేవారు. అందుకని ప్రేమవివాహాలను ఆయన ధైర్యంగా జరిపించారు.

అలాగే కాలేజీలో అధికారులనుంచి ఏవైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించడానికి ముందుండేవారు.

ప్రస్తుత రాజకీయాలు ఆయనకు నచ్చేవి కావు. "సమర్థవంతంగా ఎవరూ పరిపాలించలేనప్పుడు ఎవరికని ఓటెయ్యాలి" అని నిలదీసి అడిగేవారాయన.

సమాజ శ్రేయస్సుకు, కుటుంబ శ్రేయస్సుకు, వ్యక్తిగత శ్రేయస్సుకు ధర్మబోధ ఒక్కటే మార్గమని, అది చేస్తూ వుంటే మెల్ల మెల్లగా ప్రజలలో మార్పు వస్తుందని చెప్పేవారు. ధర్మం తప్పి నడచుకోవడం వల్ల వచ్చే కష్టనష్టాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో బోధించాలనేవారు.

పిల్లలలో నైతిక పరివర్తన తేవాలని ఆయన ఆకాంక్షించేవారు. నేటి సమాజ పరిస్థితులకు లొంగకుండా వుండే ప్రాథమిక బోధన ఇంట్లోనే జరగాలని, సాధ్యమైనంతవరకూ పాఠశాలలకు పంపించకుండా ఇళ్ళల్లోనే విద్యను గరిపే కుటుంబ పరిస్థితులను ఎవరికి వారే ఏర్పరచుకోవాలని ఆయన చెప్పేవారు. అప్పుడు పెద్దవాళ్ళయిన తర్వాత వాళ్ళు ఎక్కడ వున్నా నైతిక ప్రవర్తన కలిగి వుంటారని ఆయన బోధించేవారు.

ఇంతటి గురువు లభించడం నిజంగా ఎన్నో జన్మల పుణ్యఫలమే. అయినప్పటికీ ఆయన నాశ్రయించి, తర్వాత ఆయనలో లోపాలెంచి ఆయనకు దూరమవడం దురదృష్టకరమైన విషయమే. ఆయన మాత్రం తమ వద్దకు వచ్చిన ప్రతివారికి ఆధ్యాత్మ బోధ చేస్తూనే వుండేవారు. తమను విడిచి ఎవరైనా వెళ్ళినా ఆయన పట్టించుకునేవారు గాదు. వచ్చినవారు తమకు పూజ్యశ్రీ మాస్టరుగారు నచ్చకపోతే వారికై వారే ఆయనను విడిచి వెళ్ళిపోయేవారు. ఆయన దగ్గరకి ఎవరైనా ఎప్పుడైనా రావచ్చు. వాళ్ళకు ఇష్టం లేనప్పుడు వెళ్ళిపోవచ్చు. ఇది ఎక్కడైనా మనకు కన్పిస్తుందా? అది మనవైపు నుంచి ఆలోచించినా సమంజసమేనా? ఎవరైనా మనలను కొంచెం అవమానించినా, మనపట్ల వ్యతిరేకంగా ప్రవర్తించినా మనం సహించగలమా? తిరిగి మన వద్దకు వస్తే అంతకుముందు లాగానే ఏమాత్రం తగ్గని ప్రేమతో వాళ్ళతో ప్రవర్తించగలమా? అది ఆయనకు మాత్రమే సాధ్యం. అందుకే ఆయన పిల్లలను నిజంగా ప్రేమించే తల్లి, తండ్రి గూడ.

సాంసారిక జీవితాన్ని ఆధ్యాత్మికతనూ సమన్వయపరుచుకుంటూ జీవించడమెలాగో ఆయన చేసి చూపించారు. రెండింటికి ఎక్కడా ఆటంకం రాకుండా జీవించడంలోని మెలకువలు ఆయనను చూసి నేర్చుకోవాలి. 'కర్మసుకౌశలం' అన్న గీతా వాక్యానికి ప్రత్యక్ష సాక్ష్యం ఆయన. మామూలుగా కొద్దిగా భక్తిగా వున్నవారు గూడ లౌకిక విషయాలను పట్టించుకోకుండా వుండడం లోకంలో చూస్తుంటాము. అందుకనే ఆధ్యాత్మిక జీవితమంటే లౌకికత వదులుకోవడం గాబోలు అన్న భయం వల్ల ఆధ్యాత్మిక వైపుకు చాలామంది తొంగిగూడ చూడరు, తొలగిపోతుంటారు. అలాగాక రెండింటినీ సమానంగా తీసుకురావడం పూజ్యశ్రీ మాస్టరుగారి యందు ప్రకటమవడం చూస్తాము. మామూలు వ్యక్తులకంటే ఎక్కువగా అందరినీ

ప్రేమించడం, వారిని పట్టించుకోవడం, వారి అవసరాలు తీర్చడం చేసేవారాయన. ఇంట్లో భార్యాబిడ్డలనే గాదు, సహాధ్యాయులను, విద్యార్థులను, సహోపాధ్యాయులను, తమకు పరిచయమున్న వారందరినీ, తమ వద్దకు వచ్చే ప్రతివారినీ ఆయన ఆదరంగా చూడడము, వారి లౌకిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు పాటుపడడం చేసే వారాయన. ఈ ప్రత్యేక లక్షణం గూడ అందరిలో వుండదు.

ఎందుకంటే జీవితంలో అంతవరకూ కష్టాలే చూడని బుద్ధుడు, అన్నగారి పాపను విపరీతంగా ప్రేమించిన వేమన, భార్యను ఎంతగానో ప్రేమించిన తుకారాము, తమకు సంభవించిన ఏదో ఒక సంఘటన ద్వారా పూర్తి విరాగులై సర్వాన్నీ త్యజించారు. ఇక మహాభక్తుల, జ్ఞానుల విషయం చెప్పనవసరం లేదు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు అలాగాదు అట్టి విషాద సంఘటనే ఆయన జీవితంలో గూడ జరిగినప్పటికీ ఆయన వైరాగ్యం పరిధులు దాటలేదు. లోపల పూర్తి విరాగి అయినప్పటికీ బయటకు మాత్రం రాగి వలె (అనురాగి వలె) అన్ని కర్తవ్యాలూ ఆయన నిర్వర్తించారు. “నాకేమీ ఈ ప్రపంచంలో చేయవలసింది లేదు. కానీ నేను ఇతరులకోసం అన్నీ చేస్తాను” అన్న గీతాచార్యుని వచనం పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల పూర్తిగా వర్తిస్తుంది. మళ్ళీ ‘ఆత్మానం మానుషం మన్యే’ ‘మామూలు మనిషిగానే నన్ను నేను భావిస్తున్నాను’ అన్నట్లు ప్రవర్తించేవారు ఆయన..

ఒక ప్రక్క అన్నీ తెలిసినా గుప్పిడి విప్పకూడదంటూ ఏమీ తెలియనివానివలె ప్రవర్తించేవారాయన “అబ్బే! నాకేమీ తెలియదు. నేను మీకంటే ముందు శిరిడి వెళ్ళాను గనుక మీకు ఆ మార్గం చెబుతున్నాను అంతే!” అని, “నేను గురువును గాదు. అందరికీ గురువు ఆ సాయినాథుడే” అనీ, “నేను ఆయనను చేర్చే వంతెన లాంటి వాడిని” అని చెప్పుకున్నారాయన.

పరమ వైరాగ్యంతో సంసారమే వద్దని. సర్వాన్ని త్యజించాలని తలచిన ఆయన గుర్వాదేశంపై వివాహం చేసుకుని, సంసార జీవితంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకున్నారు. ఆయనకు వైరాగ్యమే లేకపోతే “బాబా ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లడమేనని” ఎలా చెప్పగలిగేవారు? అలాగాకపోయినా బాబా ఎలా వుంచితే అలా వుండాలనుకోకపోతే గూడ అది సాధ్యంకాదు. అందుకే ఆయన ఉత్తమ గురుభక్తుడు, పరమ వైరాగ్యమూర్తి.

ఆయన నన్ను, పిల్లలని ఎంతో ప్రేమగా చూసుకునేవారు. మాకు ఏ లోటూ రానివ్వలేదు. నా సాధన గూర్చి ఎంతో శ్రద్ధ వహించేవారు. సాధనలో ఎన్నో మెలకువలు చెప్పేవారు. ఏయే సమయాలలో, సందర్భాలలో, పరిస్థితులలో భావనలను సరిగ్గా ఎలా మలచుకోవాలో, ఎలా వివేకంతో ఆలోచించాలో ఆయన చెబుతుండేవారు. ఆయన ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు. కానీ వాటినెప్పుడూ నాతో చెప్పేవారు గాదు. నాకు చెప్పి నన్ను బాధ పెట్టడమెందుకని ఆయన భావం కావచ్చు. అలాగాక అనవసరమని గూడ చెప్పకపోయివుండవచ్చు.

ఇక ఆయన వద్దకు వచ్చిన తర్వాత నా జీవితం వడ్డించిన విస్తరే. నాకు ఏమి లోటున్నది? అవసరమైన అన్నింటినీ ఆయన సమకూర్చారు. పదిమంది వున్నప్పుడు చిన్న చిన్న సమస్యలు మామూలే. అందరిని సర్దుకుపోవడమే సాధన. ఆయన వద్దకు వచ్చిన ఎవరికీ ఏ చింతా వుండదు. అంతా ఆనందమే. అలాంటిది ఆయన సన్నిధిలో నిరంతరం వున్న నాకు చింతకు తావెక్కడ? ఆయన పవిత్ర ప్రశాంత ఆనంద సాగరం. అందుకని ఆయన సన్నిధిలో నాకు నా శారీరక బాధలు ఏమీ కలత పెట్టలేదు. పెట్టబోవు గూడ. ఇప్పటికీ ఆయన ఈ కుటుంబానికి ఎటువంటి కొరతా లేకుండా చూసుకుంటున్నారు. అదే ఆయనకు మామీద వున్న ప్రేమకు నిదర్శనం. బాబా అద్భుత లీలకు ప్రత్యక్ష సాక్ష్యం.

ఆయన గురించి యిలా చెప్పుకుంటూ పోతే అంతుండదు. అందుకే అన్నాను – సముద్రంలోని అల సముద్రాన్ని అంచనా వేయగలదా? దాని గొప్పతనాన్ని మొత్తంగా చెప్పగలదా?

అందుకే నేనెప్పుడూ అనుకుంటుంటాను. “మా కుటుంబంలోని వారికంటే అదృష్టవంతులెవరుంటారు?” అని.

ఇంతటి అదృష్టాన్ని ప్రసాదించిన ఆ బాబాకు ఏమని కృతజ్ఞత తెలుపగలను? ●

# మాతృదేవి స్మృతులు

శ్రీమతి రాజ్యలక్ష్మి

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలావైభవాన్ని విజయవాడకు చెందిన శ్రీమతి రాజ్యలక్ష్మిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నాకు పెళ్లయ్యేవరకు పూజ్యశ్రీ అమ్మగారి గురించి కానీ, పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి కానీ ఏమీ తెలియదు. నేను శిరిడి సాయినాథుని పూజించుకునేదాన్ని. వారే ప్రధాన పాత్ర వహించి వెంకటరమణ గారితో 1999లో నాకు వివాహం జరిపించారు. మావారు అప్పటికే పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలన్నీ పారాయణ చేసేవారు.

మా వివాహమైన వెంటనే నన్ను పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి ఒంగోలుకు తీసుకువెళ్లారు. పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారము చేసుకున్నాక నన్ను పూజ్యశ్రీ అమ్మగారు చాలాసేపు పరీక్షగా చూశారు. అప్పటికి మహాత్ములతోను, వారి సంప్రదాయంతోనూ నాకు అసలు పరిచయం లేదు. నేను ఏ గ్రంథాలూ చదవలేదు. అందువల్ల పూజ్యశ్రీ అమ్మగారు అంత పరీక్షగా చూసేసరికి నాకు భయమేసింది. ఇప్పుడు తిరిగి చూసుకుంటే, నా వివాహమైన కొద్దిరోజులకే తల్లిని పోగొట్టుకున్న నన్ను పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. నేను నమ్ముకున్న శ్రీ సాయినాథులే ఈ సంబంధం కుదర్చడం ద్వారా నన్ను వీరికి అప్పగించారు.

మాకు ఇద్దరు అమ్మాయిలు. పిల్లలిద్దరూ పుట్టిన కొన్నిరోజులకు మాకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. అందుకు కొద్దిరోజుల ముందు పూజ్యశ్రీ అమ్మగారు గురువారం రోజున స్వప్నదర్శనమిచ్చి, "రేపటినుంచి లలితాసహస్రనామం చదువుకో!" అని చెప్పారు. అప్పుడు కొన్నిరోజులు చేసి మానేశాను. ఆ తరువాత బాగా ఆర్థిక ఇబ్బందులొచ్చాయి. నేను కూడా ఉద్యోగం చేసేదాన్ని. కానీ కొంతకాలానికి నాకు ఆరోగ్యం దెబ్బతిని ఉద్యోగం మానుకోవలసి వచ్చింది.

అదే సమయంలో మళ్ళీ ఇంకొకసారి పూజ్యశ్రీ అమ్మగారు స్వప్న దర్శనమిచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలన్నీ ఒక పీటమీద చేర్చి పెట్టి, ఇవన్నీ చదవమన్నారు. నేను నిత్యం శ్రీ సాయిలీలామృతము, శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిసన్నిధి పారాయణ చేసేదాన్ని. మిగిలినవి చదవలేకపోయాను. ఒకసారి మిలారేపా గ్రంథం చదువుతుంటే బాగా దుఃఖం వచ్చి విపరీతంగా ఏడ్చాను. మేము ఆ స్థలం మారి ఇంకొకచోటికి వెళ్ళాక మార్పు వచ్చింది.

మేము ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో అవసరానికి ఎవరో ఒకరు వచ్చి ఆదుకొనేవారు. పిల్లల చదువులు ఆగలేదు. మాకు ఆర్థిక సమస్య వుందని ఎవ్వరికీ తెలియలేదు. ఈ విధంగా గురుదంపతులు, శ్రీసాయినాథులు

మమ్మల్ని ఆదుకున్నారు. ఇప్పుడు మా పెద్దమ్మాయి MBBS పూర్తిచేసి PGకి సిద్ధమవుతోంది. మా చిన్నమ్మాయి MBBS మూడవ సంవత్సరము చదువుతోంది.

నేను కొంతకాలం పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసాను. మా ప్రిన్సిపాల్ ఎప్పుడైనా సెలవు అడిగితే ఇవ్వకపోగా ఉద్యోగం మానెయ్యమనేవారు. ఒకసారి మాకు బాగా సన్నిహితంగా వుండే గురుబంధువుల ఇంట్లో జరిగే వేడుకకు వేరే వూరికి వెళ్ళవలసివచ్చింది. ఆ విషయం చెప్పి సెలవు అడిగితే నాకు ఎప్పటి సమాధానమే వచ్చింది. ఇక వెళ్లడం మానుకుని పాఠశాలకు వచ్చేశాను. కానీ వెళ్లలేకపోయానని చాలా బాధగా వుంది. ఆరోజు రాత్రి పూజ్యశ్రీ అమ్మగారు స్వప్న దర్శనమిచ్చి, "ఏంటమ్మా, గురుబంధువుల ఇంటికి ఎందుకు వెళ్ళలేదు?" అనడిగారు. "సెలవు ఇవ్వలేదమ్మా!" అన్నాను. "అడిగే విధంగా అడిగితే సెలవిస్తారమ్మా! మరి గురుబంధువుల ఇంటికి వెళ్ళాలి కదా?" అన్నారు!

ఇంకొకసారి గురుబంధువు ఒకరికి గుండెకి శస్త్రచికిత్స చేస్తుంటే వెళ్లవలసివచ్చింది. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారి స్వప్నదర్శనాన్ని తలచుకుని మా ప్రిన్సిపాల్ తో, "నేను ఇలా వెళ్లాల్సిన అవసరం వుంది. మీకు వీలైతే సెలవు ఇవ్వండి, లేదా ఉద్యోగం మానెయ్యమంటే మానేస్తాను!" అన్నాను. "అయ్యెయ్యో, ఎందుకండీ? మీకు ఎన్నిరోజులు కావాలంటే అన్ని రోజులు తీసుకోండి!" అన్నారు! ఆవిడ సమాధానానికి నేను చాలా ఆశ్చర్యపోయాను. నేను వారికి సహాయంగా వుండడం కోసం చాలా రోజులపాటు నిశ్చింతగా సెలవు తీసుకోగలిగాను. అంతా పూజ్యశ్రీ అమ్మగారి దయ!

పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందాక మండలారాధనలోపు ఒకసారి గుమ్మళంపాడు సేవకు వచ్చాము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారిని ఒక కోరిక కోరుకున్నాను. కొన్ని కుటుంబ కలహాల వల్ల మా అత్తగారు మా బావగారింట్లో వుండిపోయారు. ఆమెకు మా దగ్గరకు రావాలని వుంది. నాకు కూడా ఆమెకు సేవ చేసుకోవాలని వుంది. కానీ వాళ్ళు పంపటం లేదు. ఆమెకు చాలా పెద్దవయసు వచ్చేసింది.

మా అత్తయ్యకు సేవ చేసుకునే అవకాశం కల్పించమని పూజ్యశ్రీ అమ్మగారిని వేడుకున్నాను.

అక్కడనుంచి తిరిగివెళ్ళాక, మావారు వారి అన్నయ్యగారి దగ్గరకు వెళ్లి అడుగుతామన్నారు. నేను, "బాబా, అమ్మగారు, మాస్టరుగారు కొలువైవుండి ఇన్ని పారాయణలు చేయించిన మన ఇంట్లోనుంచే ఫోన్ చేసి అడగండి" అన్నాను. మావారు ఫోన్ చేసిన వెంటనే, "తప్పకుండా వచ్చి తీసుకెళ్లండి" అని సమాధానం వచ్చింది! మేము అసలు నమ్మలేకపోయాము. చాలా ఆనందంతో మా అత్తగారిని తీసుకొచ్చాము. ఆమెకు కూడా మా ఇంట్లో వుండాలన్న చిరకాల కోరిక నెరవేరింది.

మేము పూజ్యశ్రీ అమ్మగారి మండలారాధన ముందు సేవకి వచ్చినప్పుడు, ద్వారకబాబుగారు మాకు మామిడిపండ్లు ప్రసాదంగా ఇచ్చారు. మా అత్తగారికి ఆ పండ్లను ప్రసాదంగా ఇస్తే, అవి పూజ్యశ్రీ అమ్మగారినుంచి వచ్చాయని చాలా సంతోషంగా, తృప్తిగా భుజించారు. మండలారాధన రోజు పూజ్యశ్రీ అమ్మగారికి అభిషేకము చేసిన తీర్థము మాకు లభించింది. అది కూడా మా అత్తగారు తీసుకున్నారు. మా ఇంటికి వచ్చిన వారం రోజులకు ఆవిడ తృప్తిగా కన్నుమూశారు. మా కోరిక, ఆమె కోరిక, పూజ్యశ్రీ అమ్మగారు తీర్చారు.

తల్లిలేని నాకు పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి అన్నీ తామే అయి ఇంతవరకు నన్ను అనుగ్రహిస్తున్నారు. వీలైనన్నిసార్లు పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధానానికి వచ్చి సేవ చేసుకుంటున్నాము. ఒకసారి అలా సేవకి వచ్చినప్పుడు ఉదయం మేలుకొలుపు సేవ పూర్తయ్యాక నేను పూజ్యశ్రీ అమ్మగారి సమాధి చుట్టూ సేవ చేస్తుంటే నాకు ఓంకారము లోపలనుంచి స్పష్టంగా వినిపించింది. ప్రతిక్షణం పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర అనుభూతి పొందుతూనే ఆనందంగా సేవ చేసుకున్నాను.

ఇంతటి అదృష్టాన్ని కల్పించిన శ్రీసాయినాథునికి కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు సమర్పిస్తూ, మాతాపితరులైన పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి శిరస్సువంచి పాదాభివందనములు అర్పిస్తున్నాను.●

# వార్తాలాపము

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

*శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.*

## 15వ ప్రసంగము

ఒకప్పుడు శ్రీ ప్రకాశానంద స్వామివారు రాజకోట నుండి పీఠడియాకు వెళ్లదలిచారు. ఇది తెలుసుకొని త్రయంబకభాయి, జయంతీభాయి మేము కూడా వస్తామన్నారు. స్వామివారి అనుమతితో వారు కూడా వెంట వచ్చారు.

ప్రకాశానంద స్వామివారు జయంతీ భాయిని నిత్యానంద స్వామివారికి పరిచయం చేస్తూ ఇలా అన్నారు: "ఈయన డాక్టర్. క్షయ వ్యాధి వస్తుందేమోనని భయంతో వున్నారు. కానీ ప్రస్తుతం బాగానే వున్నారు. దయతో వీరికి ఏమైనా చెప్పండి."

### సద్భావన వలన కలుగు లాభము

స్వా॥ని॥: భావము ప్రధానము. సద్భావం కలిగి వుండండి. నేను రోగిష్టి వాడిని, బాధగా వున్నది అనుకుంటూవుంటే, ఇంకా ఎక్కువ బాధ కలుగుతుంది. కాబట్టి రోగం తగ్గిందనే సద్భావనతో వుండండి.

జయంతీ॥: మీ కృప వలన నా బాధ తగ్గిపోయింది. నాకేమీ బెంగ లేదు. నాకు చాలాకాలం నుంచి మరొక రోగం వున్నది. దానిని పోగొట్టండి.

స్వా॥ని॥: ఆ ఇంకో రోగం ఏమిటి?

### మనసును నిలబెడితే కలిగే లాభము

జయంతీ॥: నా మనసు ఎంతో చంచలంగా వున్నది. దానిని నిలపడానికి ఏదైనా చికిత్స చెప్పండి. నా మొర ఆలకించండి.

స్వామి నిత్యానందులవారు ప్రకాశానందులవారిని సమాధానం చెప్పమన్నారు.

స్వా॥ప్ర॥: నాతో ఎక్కువ సాన్నిధ్యం వుండడం వలన నమ్మకము తక్కువగా వుంటుంది. మీరే ఏదైనా చెబితే మంచిది.

స్వా॥ని॥: తమతో ఎక్కువ సాన్నిధ్యం వున్నట్లయితే మీరే రోగాన్ని బాగానే తగ్గించి వుంటారు. కాబట్టి దానికి మందు ఇచ్చే బాధ్యత కూడా మీరే తీసుకోండి.

స్వా॥ప్ర॥ : (జయంతీ భాయిని ఉద్దేశించి) మనసు నిలపడం వలన నీకు కలిగే లాభమేమిటి?

**శ్లో॥ ప్రయోజన సంప్రవృత్తేః**
**కారణం ఫలలక్షణమ్ I**
**ప్రయోజన మనుద్దిశ్య**
**న మందోఽపి ప్రవర్తతే II**

భావం : కార్య ప్రవృత్తికి (కార్యము చేయాలనే ఉద్దేశానికి) కారణం ఫల వివరణం (ఫలము యొక్క స్పష్టత). ప్రయోజనం లేనిదే మూఢుడు కూడా కార్యము చేయడు.

ఫల జ్ఞానము కలిగేదాకా కార్యముపట్ల(పనిపట్ల) మనఃప్రవృత్తి(ఆసక్తి) కలుగదు. ఫలానా దేశంలో ఫలానా వ్యాపారం చేస్తే కొద్దికాలంలోనే చాలా లాభం కలుగుతుంది – అని తెలిస్తే, మానవుడు తన దగ్గర మూలధనం లేకపోతే అప్పు తీసుకొనివచ్చైనా, ఇల్లు అమ్మైనా ఆ వ్యాపారం చేసి, అనేక కష్టాలు అనుభవించైనా ధనాన్ని సంపాదిస్తాడు. ఇప్పుడు ధనం కోసం చాలామంది అనేక కర్మలు (ఎన్నో పనులు) చేస్తున్నారు. మాయామోహితమైన సుఖాలకు సాధనము ధనం అవడమే యిందుకు కారణము. అలాగే ధనం వల్ల కలిగే ప్రయోజనము(ఫలితము) వారికి తెలియడం వల్ల ధనం ద్వారా సుఖాన్ని పొందడానికి ప్రయత్నం చేస్తున్నారు. మనస్సును ఆపుకోవడం వల్ల మీకు కలిగే ప్రయోజనం ఏమిటి?

జయంతీ॥: పరమాత్మ లభించడమే ప్రయోజనము.

## పరమాత్మ అస్తిత్వము

స్వా॥ప్ర॥ : అయితే మీరు పరమాత్మ వున్నాడని అంగీకరిస్తున్నారా? ఈ రోజున ఇంగ్లీషు చదువులు చదివినవారు ప్రకృతిని మాత్రమే అంగీకరిస్తారు. మా సైన్స్ లో ఈశ్వరుడు అనే పదార్థమేదీ లేదంటారు.

జయంతీ॥: నేను మెడికల్ కాలేజీకి వెళ్లినప్పుడు మొదట 'దేవుడు వున్నాడా, లేడా' అనే విషయం ఆలోచించలేదు. కానీ అక్కడ శవాలను కోస్తున్నప్పుడు పెద్ద డాక్టర్లు మెదడును చూపించి అందులో జ్ఞాననాడులను చూపించి "వీటిలో ఎంత జ్ఞానం వుందో ఎవరికీ తెలియదు. దేవుడి సృష్టి వైచిత్రి ఎంతటి అద్భుతమో ఇవి తెలుపుతాయి. ఎంత నాస్తికుడైనా వీటిని చూసిన దేవుడి అస్తిత్వాన్ని అంగీకరించవలసివస్తుంది" అని చెప్పారు. ఆ తరువాత నా ఆరోగ్యాన్ని పరీక్షింపజేయించుకోవటానికి సివిల్ సర్జన్ డా॥హుటాను దగ్గరకు వెళ్లాను. ఆయన పరీక్షించిన తర్వాత ఇలా అన్నాడు "జయంతీ లాల్! పరీక్షించే డాక్టరు, రోగి – ఇద్దరి మధ్య మూడవ శక్తి ఏదో పనిచేస్తున్నది." ఇలా నాకు దేవుని మీద నమ్మకం కలిగింది. స్వర్గ నరకాలను, బంధమోక్షాలను నేను అంగీకరిస్తాను. కాబట్టి నా మనస్సు విషయాల మీదకు ఎక్కువగా పరిగెడుతుంది.

## ధనానికి దైవభక్తికి దూరం

స్వా॥ప్ర॥ : నీకు దైవం మీద నమ్మకం వుంటే ధనం సంపాదించడానికి యింత శ్రద్ధ ఎందుకు చూపుతున్నావు? అన్నపానాదులను యిస్తున్న దైవం మీద అంత శ్రద్ధ లేదేమి?

జయంతీ॥: నమ్మకం వుంది. కానీ ఎక్కువ ప్రయత్నం చేయాలి కదా! పళ్ళెంలో అన్నం వున్నా కూడా చేతితో తిన్న తరువాతనే కడుపు నిండుతుంది. అదే విధంగా ప్రయత్నించనిదే ఏమీ లభించదు.

స్వా॥ప్ర॥ : ఆ ప్రయత్నం చేయవద్దని ఎవరన్నారు? కానీ త్వరలో గొప్ప ధనవంతుడివి అయిపోవాలని కోరిక కలిగింది. మరి ప్రయత్నం ధనం కోసం చేస్తున్నావు. మాటలు దేవుని కోసం చెబుతున్నావు.

జయంతీ॥: డబ్బు లేనిదే రోజెలా గడుస్తుంది?

స్వా॥ప్ర॥ : రోజు గడుపుకోవడానికి ప్రయత్నం చేయడంలో తప్పులేదు. కానీ చాలా ధనం లభించాలని నీ కోరిక.

జయంతీ॥: అయినా తప్పేముంది? చాలా ధనం లభిస్తే ధర్మకార్యాలు చేస్తాను.

**- సశేషం**

# బుద్ధ ధ్యాన హృదయము

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

## అధ్యాయం - 3

నిత్యజీవితానుభవాలను వాస్తవంగా లేనట్టి (కానిదున్నట్టనిపించే) వ్యక్తిత్వానికి (లేక జీవాత్మ) అలవాటుగా మనం ముడిపెడతాము. ఈ మూడు అభ్యాసాలు 'యీ నిత్యజీవితానుభవాలలో వ్యక్తిత్వంతో కూడినదిగాని, వ్యక్తిత్వరహితమైనదిగాని స్థిరమైన తత్వమొకటి లేనేలేదు' అన్న సత్యంతో సమన్వయ పరుస్తాయి. అట్టి స్థిరమైన వ్యక్తిత్వం వున్నది అన్న విశ్వాసాన్నాధారం చేసుకొని వ్యవహారిక స్థితి పరమార్థ స్థాయిగా మారుతుంది. ఈ విధంగా విడివిడిగా వుండే జీవితానుభవాలు పూర్ణమైన బుద్ధధర్మంతో సమన్వయపడి దాని వివిధ అంశాలకు చెంది వుంటాయి.

ఈ విధంగా ధర్మానుపశ్యన సాధనను వినియోగించుకోవడానికి ఒక చక్కని ఉదాహరణను వ్యాఖ్యానం తిరిగి తిరిగి చెబుతుంది. సూత్రంలో యివ్వబడిన ప్రతి అభ్యాసాన్ని పూర్ణంగా వివరించిన తఋవాత దానిని నాలుగు మహాసూత్రాలకు అన్వయిస్తుంది. ఉదా: "ఇక్కడ వచ్చిపోయే శ్వాసను తప్పుకొనే స్మృతి దుఃఖమనే సత్యం".

ఆ స్మృతికి ముందువచ్చే కోరిక (లేక తృష్ణ) ఆరంభం లేక 'ఉత్పత్తి' అనే సత్యం. ఆ రెండు నిలచిన స్థితి 'లయం' అనే సత్యం. దుఃఖాన్ని అర్థం చేసుకోవడం, ఉత్పత్తిని పరిత్యజించడం, లయాన్ని లక్ష్యంగా తీసుకోవడం సత్యానికి మార్గం."

నిత్యజీవితానికి ధర్మానుపశ్యన వినియోగించుకోటానికి చక్కని ఉదాహరణ యిది. చిన్నదిగాని పెద్దదిగాని యే సంఘటనైనా స్మృతితో, యోచనతో గమనించటానికి అవకాశం కలిగినపుడల్లా నాలుగు మహాసత్యాలకు అన్వయించుకోవాలి. ఈ విధంగా 'జీవితం సాధనతో ఐక్యం కావాలి. సాధన సంపూర్ణజీవితం కావాలి' అనే సూత్రానికి సన్నిహితుడు కావచ్చు. ఈ విధంగ 'భావానుపశ్యనం' (వేదనానుపశ్యనం), 'చిత్తానుపశ్యనం', 'ధర్మానుపశ్యనం',



'కాయానుపశ్యనం' అను నాలుగు ధ్యానాలు బుద్ధ ధర్మానికి మూల ప్రాతిపదిక అయిన అనాత్మ అనే సత్యం మీద కేంద్రీకృతమౌతాయి. ఒక వంక వ్యక్తిత్వములేక జీవితమే లేదని, మరొక వంక వస్తుత్వము లేక పదార్థమే లేదని తెలిపే ముక్తిప్రదమైన అనాత్మ సత్యాన్ని అనుభవగతం చేసుకోడానికి తగిన తాత్విక సిద్ధాంతము, ఆచరణలను చెబుతుంది స్మృత్యపస్థాన సూత్రము.

**- సశేషం**

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

## అధ్యాయం - 4

## ఉపనయనం

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

ఒక గృహంలో ఒకేరోజు, ఒకే సమయంలో ఒక సంతోషం, ఒక విషాదం ఒకేసారి సంభవించటం ఎంత ఆశ్చర్యం!

కష్టం – సుఖం; సంతోషం – సంతాపం; జననం – మరణం; సృష్టి – లయం; ఈ ద్వంద్వాలమయమే జగత్తు. ఇదే సృష్టితత్వం.

ద్వంద్వాలను అధిగమించి, చంచలము, చైతన్యమయము అయిన ప్రకృతి వెనుక అచంచలంగా, నిశ్చలంగా వున్న పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకొనటమే అద్వైత సిద్ధి.

అనుక్షణం కదలిపోయే నీలిమబ్బులవంటి సుఖ–దుఃఖాలమయమైన జీవిత సంఘటనల వెనుక పరుగుతీయక నిశ్చలమైన నీలాకాశం వలె నిలకడగా మనసును నిలువరించుకొని ద్వంద్వాలపట్ల నిర్లిప్తతతో చరించటమే నిశ్చలానందానికి మార్గం.

తమ యింట్లో అనూహ్యంగా సంభవించిన ఈ విషాద సంఘటన ద్వారా జననమరణాలను అతిక్రమించాలన్న వేదాంతసారం భరద్వాజగారికి ఉపదేశించ బడింది.

ఆ సారాసార వివేకాన్ని పొందేందుకు దారిచూపే జ్ఞాననేత్రాన్ని ప్రసాదించిన ఉపనయన కాండ ఆయన పరమార్థాన్ని చేరుకొనే మార్గానికి తలుపులు తెరచింది. ఆయనలో అంతర్మథనం ఆరంభమైంది.

సృష్టితత్వాన్ని తెలుసుకొనాలనే ఆశయ సాధనకై అవిశ్రాంతంగా సాగిన ఆయన ప్రయాణంలో ఆరు సంవత్సరాల సుదీర్ఘ కాలం గడచిపోయింది.

ఈ కాలమంతా ఆయన మనసు చేసిన పరిశోధనంతా ప్రశ్నలమయమే! ప్రశ్నలకు స్ఫురించిన ఎన్నో సమాధానాలు!

సమాధానపడని మరెన్నో ప్రశ్నలు! ఎన్నో భావనలు! భావాతీత స్థితులలో కలిగే దివ్యానుభూతులు!

వ్యక్తంలో నుండి అవ్యక్తం వైపుకు నడిచింది ఆ ప్రయాణం. దృశ్యంలో నుండి అదృశ్యం వైపుకు సాగింది ఆ సత్యశోధనా ప్రవాహం.

తుదకు కనుచూపుమేరలో తీరం కనిపించింది. ఈ ప్రయాణం చివరి మజిలీ చేరుకుంది.

ఆయన ఆశించిన, శోధించిన సత్యం అవగతమయ్యే సమయం ఆసన్నమైంది! ఒంగోలు శర్మ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్ గా పనిచేస్తున్న రోజులలో భరద్వాజగారు తమ సహోపాధ్యాయుడు ప్రసాదుగారితో కలసి సంతపేటలోని ఒక యింట్లో అద్దెకు వుండేవారు. ఆ రోజులలో ఆయన అసమాన ప్రజ్ఞ, ఋజువర్తన, సదాచరణ చూపరులందరికీ ఆయనపై ఎంతో గౌరవ భావాన్ని కలిగిస్తుండేవి.

ఉపనయన ఘట్టంతో ఆరంభమైన ఆయన సత్యాన్వేషణకు సంబంధించిన అంతర్మథనం నిరంతరం కొనసాగుతూ వున్న ఆ రోజులలో ఆయన తరచు తమ

తీరిక సమయాలలో ఊరి బయట ఏకాంత ప్రదేశంలో ఒంటరిగా నడుస్తూ తమ ఆలోచనలలో నిమగ్నులై వుండేవారు.

ఒకరోజు సాయంత్రం వేళ ఆయన ఎప్పటివలెనే ఒంటరిగా ఊరి బయట నడుస్తుండగా వున్నట్లుండి తలలో పెద్ద శబ్దమై మనసంతా నిరామయమై, ప్రగాఢమైన శాంతి అనుభవమైంది. ఏళ్ళ తరబడి కొనసాగిన అంతర్మథనం ఆగిపోయింది. జనన మరణాలపై, సృష్టితత్వంపై ఆయన మనసులో కొనసాగిన ప్రశ్నల పరంపర ఒక్కసారిగా అంతమై సకల ప్రశ్నలు సమాధానపడ్డాయి. ఆయన పరిశోధన అంతమైంది. సకల విశ్వాన్నీ పాలిస్తున్న మహాశక్తిని గురించిన అవగాహన ఆయన ఆంతర్యంలో అవగతమైంది.

ఈ అద్భుతమైన అనుభవంతో భరద్వాజగారి జీవనశైలిలో పూర్తి మార్పు వచ్చింది. ఆయన ఆలోచనా విధానం మరోవిధంగా మలుపు తిరిగింది. ●

# అధ్యాయం - 5

## *సాధన - పరిశోధన*

తమ ప్రశ్నలు, సందేహాలు, ఆకస్మికంగా, అనూహ్యంగా సమాధానపడిన నేపథ్యంలో తాము కనుగొన్న సత్యాలన్నీ సరియైనవి అవునా, కాదా అని నిర్ధారించుకోనాలన్న ఉద్దేశంతో శ్రీ భరద్వాజగారు ఎన్నో తత్త్వగంథ్రాలు పఠించారు. ఆ గ్రంథాలలోని విషయాలన్నీ సరిగ్గా తమకు తోచిన సత్యాలు, సిద్ధాంతాలనే పోలి వుండి, తాము అన్వేషించి తెలుసుకొన్న నిజాలన్నీ నూటికి నూరుపాళ్లు సరియైనవేనని ధృవీకరింపబడటం జరిగింది.

ఒక ప్రధానఘట్టం ముగిసింది. సైద్ధాంతికంగా సృష్టిరహస్యం సంపూర్ణంగా అవగతమైంది. అయితే అది తమకు అనుభూతమవ్వాలన్నదే తదుపరి అంశం. అందుకై ఆయన యత్నం మరలా ఆరంభమైంది.

శారీరకంగా, మానసికంగా తమకు తాము తగు శిక్షణను పొంది పరమార్థాన్ని సాధించాలన్నదే అప్పటి ఆయన లక్ష్యం. సమాధానపడిన ప్రశ్నలన్నీ తమకు సమన్వయపడాలి. అనుభూతమవ్వాలి. అనుభవపూర్వకంగా తాము తత్త్వ రహస్యాన్ని సాధించాలి.

తాము యింకా మృత్యువును జయించే స్థితిని చేరుకొనలేదు. కనుక తాము పొందవలసిన లక్ష్యసాధనకు ఉపక్రమించాలి. అప్పటివరకు యీ కృషి, యీ సాధన కొనసాగవలసిందేనన్న నిర్ణయంతో భరద్వాజగారు తమ తదుపరి యత్నాన్ని ఆరంభించారు.

ఒంగోలులో తమకు కలిగిన అనుభూతిని మరల పొందాలనే యత్నంలో స్వయంకృషితో, సాధనతో 'సత్యం' యొక్క అనుభవాన్ని సాధించే యత్నం మొదలైంది. అయితే ఆయనకు ఆ సమయంలో దైవం వున్నాడా-లేడా అన్న అంశం పూర్తిగా అప్రస్తుతమన్పించింది.

సృష్టితత్వాన్ని అవగతం చేసుకొని, జరామరణాదుల నతిక్రమించి, దుఃఖరాహిత్యాన్ని పొందాలనే సంకల్పంతో ఆయన అత్యంత కఠినమైన సాధనలకు ఉపక్రమించారు.

మొదటగా ఆయనకు శరీర మనస్సులపై నియంత్రణ సాధించనిదే లక్ష్యసిద్ధి సాధ్యపడదని తోచి, తమ సాధనలో భాగంగా శరీరానికి ప్రాథమిక అవసరాలైన ఆహారము, నిద్రలను జయింప నిశ్చయించారు.

ఎన్నో రోజులు నీరు త్రాగకుండా కేవలం ఘనపదార్థాలను మాత్రమే తీసుకొంటూ గడిపారు.

కేవలం ద్రవాహారం మాత్రమే తీసుకొంటూ చాలాకాలం గడిపారు. నిరాహారిగా కూడ ఎన్నో రోజులున్నారు.

మలమూత్ర విసర్జనలను చేయకుండా ఎంతోకాలం శరీరాన్ని నియంత్రించుకో గలిగారు.

- సశేషం

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

అమ్మ వెంటనే సంతోషంగా "బాగుంది, అయితే వెంటనే రేపే సన్యాస దీక్ష యివ్వడానికి తగిన గురువును అన్వేషించడానికి శంకరానందను పంపిస్తాను. చైత్ర సంక్రాంతికి యింకా కేవలం ఆరేడు రోజుల వ్యవధి మాత్రమే వున్నది" అన్నారు యెంతో వుత్సాహంగా.

అమ్మ శశాంకబాబుతో మరల అనునయంగా యిలా చెప్పారు. "నాకై నేను యేది చేయనని నీకు తెలుసు కదా! జరగవలసినది జరుగుతున్నది. అయినా నేను ప్రత్యేకంగా యేమీ చేయటం లేదు. పూర్తిగా నీ యిష్టప్రకారమే చేస్తున్నాను. నీవు కోరినట్లే నేను చేస్తున్నాను. బాగా గుర్తు తెచ్చుకో. షాహ్‌బాగ్‌లో నువ్వు నా దగ్గరికి వస్తున్న మొదటి రోజులలో ఒకరోజు నువ్వు నన్ను యేమి కోరావు? 'అమ్మా నా సర్వస్వం మీదే. ఎలాగైనా మీరు నన్ను ఆధ్యాత్మిక మార్గంలో సఫలీకృతుడను గావించండి' అని ప్రార్థించలేదా? నేను అదే చేస్తున్నాను. ఈ విషయంలో నేను నిన్ను వేరే గురువుకు అప్పగిస్తున్నాను అని భావిస్తున్నావు. ఇక్కడ 'వేరు' అన్న పదానికి అర్థమే లేదు. అంతా ఒక్కటే. అందరూ ఒకటే. ఒకటి కాక రెండవది అంటూ వున్నదా? ఆ ఒక్కటే సర్వత్రా నిండివున్నది. రెండవది యెక్కడ వున్నది? మరొక విషయం యేమిటంటే సన్యాస దీక్ష యిచ్చినంత మాత్రాన ఆ దీక్షా గురువుతో యెటువంటి గురు శిష్య సంబంధము వుండదు. అందువలన నువ్వు వేరొక గురువును ఆశ్రయిస్తున్నానన్న భావం పెట్టుకోవద్దు" అంటూ అమ్మ తన ప్రేమపూరితమైన మాటలతో శశాంకబాబును ఓదార్చారు. అయినప్పటికీ శశాంకబాబును యీ ఆలోచన



కొంత వ్యాకులపరుస్తూనే వున్నది. ఆ మరునాడే అమ్మ సన్యాసదీక్ష యివ్వగలిగిన తపస్సంపన్నుడైన గురువును అన్వేషించి తెలుసుకొని రావాల్సిందిగా శంకరానంద స్వామిని ఆదేశించారు. అతడు కొన్ని ప్రదేశాలు తిరిగి కనఖల్ అనే ప్రదేశంలో 'మంగళానందగిరి మహరాజు' అనే గురువు యిందుకు తగినవారుగా భావించి అమ్మకు కబురు పంపగా, శ్రీ ఆనందమయి అమ్మ మొదట జ్యోతిష్‌దాదాను, శశాంకబాబును స్వామి దర్శించి రమ్మని అన్నారు. శశాంకబాబు "అమ్మా! నేను చూసేది యేమిటమ్మా. మీరే చూసి నన్ను యేది చేయమంటే అది చేస్తాను" అన్నాడు. అయితే అనుకోకుండా ఆరోజు ధర్మశాలను ఖాళీ

చేయవలసిన పరిస్థితి రావడం వలన అమ్మ అందరితో కలిసి కనఖల్ లోని మంగళానందగిరి మహారాజు వారి ఆశ్రమానికి చేరుకున్నారు ఆశ్రమంలోనే అందరూ వుండేందుకు యేర్పాట్లు గావింపబడ్డాయి. అమ్మ కూడా మంగళానందగిరి స్వామివారిని చూచి ఆయన సన్యాసి దీక్ష యివ్వగలిగిన తపస్సంపన్నుడిగా భావించారు.

మంగళానందగిరి మహారాజ్ గారి వయసు సుమారు 80 సం॥ వుంటుంది. ఆయన ఆజన్మ బ్రహ్మచారి. పూర్వాశ్రమంలో ఆయన నివాసం మధురానగరం. ఆయన యొక్క గురువుగారి ఆశ్రమమే యీ కనఖల్ ఆశ్రమం. ఈ ఆశ్రమంలో శ్రీ మహారాజుగారు 40 సంవత్సరములుగా వుంటున్నారు. అక్కడ అమ్మ బృందం మొత్తం వారం రోజులు వున్నారు.

సన్యాస దీక్షాగ్రహణానికి కావలసిన యేర్పాట్లన్నీ జరిగిపోయాయి. 1933సం॥ చైత్ర సంక్రాంతి రోజున శశాంకబాబు శాస్త్రోక్తంగా సన్యాస స్వీకారం చేశాడు. సన్యాసం స్వీకరించడానికి ముందు బ్రహ్మచర్య దీక్షా స్వీకారం వుంటుంది. అందువలన శిరోముండనం చేయించి, బ్రహ్మచారిని చేస్తారు. శశాంక బాబు చేత కూడా యీ క్రతువు చేయించారు. ఆ రోజున అమ్మ శశాంకబాబును రోజంతా (అంటే 24 గంటలు) గాయత్రీ జపం చేస్తూ కూర్చోవలసిందిగా ఆదేశించారు. ఆ తర్వాత ఆయన చేయవలసిన శ్రాద్ధాది కర్మలను స్వయంగాచేసి తెల్లవారుతుండగా సన్యాస మంత్రదీక్ష తీసుకోవలసి వుంటుంది. గిరి మహారాజుగారు దీక్షాగృహంలోకి వేరెవరూ ప్రవేశించడానికి అనుమతించలేదు. అయితే అమ్మ ఆ గది కిటికీ దగ్గరగా శశాంకబాబుకు కనిపించేట్లుగా నిలబడి వుండిపోయారు.

శ్రీ ఆనందమయి అమ్మ యింతకుముందు శశాంకబాబుకు 'అఖండ స్వరూప్' అని పేరు పెట్టడం జరిగింది. ఇప్పుడు సన్యాస దీక్షా స్వీకారం తర్వాత ఆయనకు 'అఖండానందగిరి' అన్న దీక్షానామం యివ్వబడింది. దీక్షా క్రతువు పూర్తయిన అనంతరం శశాంకబాబు సన్యాస వేషధారణ చేసి అమ్మ పాదాలపై పడి సాష్టాంగ నమస్కారం చేశాడు అమ్మ "నీవు సంపూర్ణంగా గృహస్థాశ్రమ నిర్వహణను ధర్మబద్ధంగా అనుసరించావు. ఇప్పుడు కూడా నీవు ప్రారంభించిన ఈ సన్యాసాశ్రమ జీవితం అఖండంగా, ఆనందమయంగా వుండుగాక!" అని ఆశీర్వదించారు.

శ్రీ ఆనందమయి అమ్మ యీ విధంగా భక్తులను ప్రత్యేకించి యిటువంటి ఆదర పూర్వక పదాలతో ఆశీర్వదించడం యెంతో అరుదు. అమ్మ వైఖరి ఒక్కొక్కరి యెడల ఒక్కొక్క విధంగా వుంటుంది. శశాంక బాబు ఆనందానికి అవధులు లేవు. భక్తి పారవశ్యంతో ఆయన మరల మరల అమ్మ పాదాలపైబడి నమస్కరిస్తూనే వున్నాడు.

శశాంక బాబును అమ్మ సంపూర్ణంగా అనుగ్రహించారని చెప్పవచ్చు. క్రమక్రమంగా ఆహార విహారాలలో, వస్త్రధారణలో, నిత్యజీవన అలవాట్లలో – నియమనిష్ఠలతో ఆయనలో మార్పు తీసుకొని వచ్చి చివరకు ఆయనకు సన్యాసాశ్రమ స్వీకారానికి అవసరమైన అర్హతను పొందేలాగా తర్ఫీదునిచ్చారు అమ్మ. శశాంక బాబు చెప్పులు, పైన చొక్కా లేకుండా యెన్నడూ వుండేవారు కాదు. అలా వుంటే ఆయన అస్వస్థులయ్యేవారు. ఇప్పుడు ఆయనను కమండలం చేతికిచ్చి కౌపీన దారిగా చేశారు. ఆయన 68, 69 సంవత్సరాల వయస్సులో కూడా నియమనిష్ఠలతో సాధన చేస్తూ ఆరోగ్యవంతులుగా వున్నారు. మొట్టమొదట ఆయన అమ్మను దర్శించిన నాటినుండి క్రమక్రమంగా ఆయనను యీ విధంగా అనుగ్రహిస్తూ గృహపరిత్యాగం చేయించి యెన్నో బంధాల నుండి ఆయనను విముక్తులను చేసి ఆయనను సంపూర్ణంగా అనుగ్రహించారు శ్రీ ఆనందమయి మాత. .

గత కొన్నేళ్లుగా మనోరమక్క అమ్మ సన్నిధిలో జీవనం గడుపుతున్నది. ఆమె భర్త సహకారంతో కొన్నాళ్లు యింటికి వెళ్లకుండా అమ్మ ఆదేశంతో ఢాకా రమణాశ్రమంలో సాధనలో గడిపింది. ఆ తర్వాత కాశీ క్షేత్రంలో తన సాధన కొనసాగించమని శ్రీ ఆనందమయి మాత మనోరమకు చెప్పటంతో ఆమె గృహ పరిత్యాగం చేసి కాశి వెళ్ళిపోయింది. అమ్మ తన పర్యవేక్షణలో ఆమె సంస్కారాలకు తగిన విధంగా శిక్షణనిస్తూ ఆమెను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించారు. చివరకు అమ్మ మనోరమకు సన్యాస దీక్ష యిప్పించాలని సంకల్పించారు. శ్రీ మంగళానందగిరి మహారాజువారు మనోరమను పరీక్షించి ఆమె నిశితమైన ఆలోచనా వైఖరిని, యేకాగ్ర బుద్ధిని, అచంచల వైరాగ్య సంపదను గుర్తించి ఆమె స్త్రీ అయినప్పటికీ సన్యాస దీక్ష స్వీకారానికి సంపూర్ణంగా అర్హురాలుగా నిశ్చయించారు. 1991 వైశాఖ బహుళ పాడ్యమి రోజు శ్రీ మంగళానందగిరి మహారాజువారి చేత మనోరమకు సన్యాస దీక్ష యివ్వబడింది.

- సశేషం

# గురు దంపతుల లీలా కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకలు

**శ్రీమతి టి. పద్మావతి**

**"సిరికి హరికి జరిగే కళ్యాణ వైభోగమే, కళ్యాణమే,,,, వైభోగమే!"**

అన్నట్లు పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ గురుదేవుల 50 వసంతాల కళ్యాణ మహోత్సవ వేడుకలు మార్చి 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండుగగా, ఉల్లాసంగా, ఉత్సాహభరితంగా, నిత్య నూతనంగా జరిగాయి.

ఈ 50 వసంతాల కళ్యాణోత్సవం వేడుకలు జనవరి 26వ తేది మాతృదేవి దివ్యసన్నిధానంలో పసుపు కొట్టే కార్యక్రమంతో మొదలయ్యాయి. గురుదంపతుల కళ్యాణ మహోత్సవం అంటే మాటలా? ఎన్నెన్నో సంబరాలు, ఇంకెన్నెన్నో ఏర్పాట్లు, ఎన్నో ప్రాంతాల నుంచి భక్తజన సందోహ ఆగమనం,,,, వీటన్నిటితో ఆ ప్రాంతమంతా నిత్యశోభను సంతరించుకుంది.

## ఒంగోలు పట్టణంలో నగర సంకీర్తన

లీలాకల్యాణోత్సవాలు మార్చి 4వ తేదీ సాయంత్రం నించి మొదలయ్యాయి. గురుదంపతుల కళ్యాణ స్వర్ణోత్సవ సందర్భంగా ఒంగోలు నగర వీధుల్లో శ్రీ సాయినాథ సమేత పూజ్యశ్రీ అలివేలుమంగా భరద్వాజుల నిలువెత్తు మూర్తులతో రథముపై ఊరేగింపు జరిగింది. నాలుగో తేదీ సాయంత్రం 6 గంటలకు ఒంగోలులోని



పూజ్యశ్రీ భరద్వాజ మహారాజు నిలయం నుంచి రథోత్సవం మొదలైంది. రథంలో ఆసీనులైన పూజ్య అలివేలుమంగా భరద్వాజులను చూడటానికి వేయికళ్ళు కూడా సరిపోవేమో అన్నంత శోభతో విరాజిల్లారు. ముఖ్యంగా పూజ్యశ్రీ అమ్మగారి ధీర గంభీర నయనాలు చూసినవారి ఒడలు పులకరించింది. మహారాజ ఠీవితో భరద్వాజ గురుదేవులు చిరునవ్వులు చిందిస్తూ దేవేరి సమేతులై, వారి గురుదేవులైన సాయినాథునితో కూడి, ఒంగోలు నగర వీధుల గుండా రథంలో పయనమయ్యారు. ఒక పక్కన స్త్రీలు కోలాహలంగా కోలాటం చేస్తుంటే, వేరొకపక్కన నామస్మరణ, మరొకవైపు మధ్య మధ్యలో ప్రత్యేక హారతులు, ఇంకొకవైపు అత్యుత్సాహానికి చిహ్నంగా, తీన్మార్ బ్యాండ్, బాణాసంచా సందడి చేసాయి. మరొక వాహనంలో ప్రసాదాలు పంపిణీ చేయగ, కొంతమంది గురు బంధువులు, ఏదినిజం, లీలా కళ్యాణ పత్రములు రహదారికి

అటు ఇటు వున్న షాపులవారికి, బాటసారులకి వితరణ చేసారు. అటు ఇటు భక్తులు పరివేష్టితులై ఆనంద పారవశ్యంతో నామం చెప్తుంటే రథం ముందుకు కదిలింది. రథముపై గురుదంపతుల సన్నిధిలో గురుపుత్రులు శ్రీ ద్వారకబాబుగారు, గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు ఆసీనులై, నామం, భజన చేస్తుండగా ఎంతో ఉత్సాహంతో ఊరేగింపు పురవీధుల్లో పయనిస్తూ లాయరు పేటలో బాబా గుడికి చేరుకుంది. శ్రీ ద్వారక బాబుగారు, శ్రీ శ్రీకాంత్ గారు, గురుదంపతుల పాదుకలను శిరస్సు నిడుకుని బాబా దర్శనం చేసుకుని, భరద్వాజ గురుదేవుల బృందావనం చేరుకుని, ప్రత్యేక పూజలు చేసి నక్షత్ర హారతి సమర్పించారు. ఆ తర్వాత కోటి సెంటర్, కొండమెట్ట మీదుగా రథం కొనసాగింది. అక్కడ గంగా హారతి జరిగే తీరులో భక్తులు వరుసగా నిల్చుని నక్షత్ర హారతులు సమర్పించారు. ఏనుగు చెట్టు వద్ద కొంతమంది మహిళలు ప్రత్యేక కోలాట ప్రదర్శన చేశారు. అక్కడినుంచి ఊరేగింపు సంతపేట బాబా మందిరానికి చేరుకుంది. అక్కడ కమిటీ సభ్యులు, పూజ్య గురుదంపతుల పాదుకలకు భక్తులందరి సమక్షంలో హారతులు సమర్పించి భజనలు చేశారు. అంతటితో నగరోత్సవం ముగిసింది. అర్ధరాత్రి సమయం దాటినా కూడా భక్తులందరూ అత్యుత్సాహంతో ప్రప్రథమంగా జరిగిన అలివేలుమంగా సమేత భరద్వాజుని నగరోత్సవంలో పాల్గొని ఆనందపరవశులైనారు.

## మాతృదేవి సన్నిధిలో 5వ తేదీ కార్యక్రమాలు

మార్చి 5వ తేదీ ఉదయం శ్రీ అలివేలుమంగమ్మ తల్లి దివ్య సన్నిధానం నందు మేలుకొలుపుతో ఉత్సవం మొదలైంది. ముగ్గురు మూర్తులకి మేలుకొలుపు, పూజ్యశ్రీ అమ్మగారి సమాధికి ప్రత్యేక అభిషేకం, అల్పాహార నివేదన పూర్తి అయిన తర్వాత ఆ రోజు కార్యక్రమంలో భాగంగా గురుదంపతులను పెళ్ళికొడుకు పెళ్ళికూతురు చేసే ఘట్టం మొదలైంది. ముందుగా శ్రీ సాయినాథులవారు వేదికని అలంకరించగా ఈ ఉత్సవాన్ని దగ్గరుండి తిలకించి తమ ఆశీస్సులందించడానికి ఎంతోమంది మహాత్ములు తరలివచ్చారు. ముందుగా వారందరినీ వేదిక మీదకి ఆహ్వానించారు. తదుపరి పెళ్లికుమార్తెను, పెళ్లికుమారుని అర్చక స్వాములు శ్రీ సూక్త పురుష సూక్త పఠనం కావిస్తుండగా వారికి ముందుగా పూర్ణకుంభాలతో స్వాగతం పలుకుతూ, కళ్యాణ వేదిక పైకి ఆహ్వానించి, ఆసీనులను గావించారు. తదుపరి ఐదుగురు వేదపండితులు పంచ సూక్తాలతో పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులకు, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మకు అర్చన చేశారు. తర్వాత పంచామృతాలతో వారి పాదుకలకు అభిషేకం చేశారు. అనంతరం వారికి నూతన వస్త్రాలను సమర్పించి మంగళ హారతుల నొసగి ఆ పూట కార్యక్రమాన్ని ముగించారు.

తిరిగి సాయంత్రం ఐదు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం మొదలైంది. వశిష్ఠుల స్థానంలో వున్న బాలసుబ్రమణ్యంగారు, బాలకృష్ణశర్మగార్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మొదలయ్యింది.

ఎదుర్కోలు మొదలవడానికి ముందుగా శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్ ఒంగోలు వారిచే, "శ్రీ అలివేలుమంగా భరద్వాజ గురుదేవుల లీలా కళ్యాణం" అనే కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శించబడింది. దీనికోసం వధూవరులను విడిది నుంచి ఆహ్వానించి కళ్యాణమంటపములో ఆసీనులు



గావించి వారికి రేపు జరగబోయే కళ్యాణాన్ని ఈరోజు బాలలందరూ ప్రదర్శించి వినోదంగా తిలకింపజేశారు.

ఈ నృత్యరూపకంలో పూజ్యశ్రీ అమ్మగారు పూజ్యశ్రీ మాస్టరుగార్ల బాల్యం నుంచి మొదలుకొని, వారి సాధనా పద్ధతులు, కళ్యాణానికి దారి తీసిన పరిస్థితులు, కళ్యాణం జరిగిన తీరు అత్యంత రమణీయంగా ప్రదర్శించబడింది. ఈ ప్రదర్శనలో వారి వివాహ ఘట్టాలు కూడా ప్రదర్శిస్తూ, ఎదురుకోలు కార్యక్రమం సమయానికి నృత్యరూపకం ఆపి, అప్పుడు జరిగే కార్యక్రమాన్ని కొనసాగించారు. ముందుగా ఆడపెళ్ళివారు, మగపెళ్ళివారు సారెలు తీసుకుని వేదిక వద్దకు రాగా బ్రహ్మగారు బాలకృష్ణశర్మ గారు, ఎదుర్కోలు కార్యక్రమాన్ని సంగీత రూపంలో చక్కగా వివరిస్తుంటే, శ్రీ ద్వారకబాబుగారు కూడా వారితో జతకలిసి ఉల్లాసభరితంగా జరిపించారు. అందులో భాగంగానే పూజ్యశ్రీ అమ్మగారిని, పూజ్యశ్రీ మాస్టరుగారిని వేదిక మీదకు ఆహ్వానించి ఆసీనులను గావించి వారి ఎదురుగా సారె సమర్పించి, వరపూజ, లగ్నపత్రిక చదవటం జరిగాయి. తదనంతరం పానకాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని నోరు తీపి చేసుకుని ఎదురుకోలు కార్యక్రమాలు ముగించారు. అటుతరువాత తిరిగి కూచిపూడి నృత్య రూపకంలో కళ్యాణ ఘట్టాలు ప్రదర్శించారు. అది పూర్తయిన తర్వాత తిరిగి మహాత్ములను, సాయినాథుని, పూజ్యశ్రీ అమ్మగారిని, పూజ్యశ్రీ మాస్టరుగారిని విడిదికి సాగనంపి సకలోపచారాలతో మర్యాదలు చేశారు. అంతటితో ఆ పూట కార్యక్రమాలకు స్వస్తి పలికారు.

## 6వ తేది లీలా కళ్యాణోత్సవం

మర్నాడు మార్చి 6వ తేదీ తెల్లవారే సరికల్లా స్వర్ణోత్సవ లీలా కళ్యాణం కోసం ప్రత్యేక అలంకరణతో వేదికను అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు. అనేక ప్రాంతాలనుంచి లీలా కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చినవారందరూ ఆ ప్రాంగణంలో అడుగిడగానే మంత్రముగ్ధులై ఆనంద పరవశులైనారు. ఆరోజు యథావిధిగా నిత్య సేవలు పూర్తయ్యాక, శ్రీ సాయినాథుని సన్నిధిలో మహాత్ముల సమక్షంలో, వేదమంత్రాలతో పూజ్య గురు దంపతుల లీలా కళ్యాణ మహోత్సవ వైభవం మొదలైంది. వరుడు తరుపున శ్రీ ద్వారకానాథ్ గారి దంపతులు, వధువు తరుపున శ్రీ శ్రీకాంత్ గారి దంపతులు ఆసీనులై కళ్యాణ క్రతువుని ప్రారంభించారు.

ముందుగా కంకణ ధారణ చేసి కళ్యాణానికి ఉపక్రమింపజేసి, వరుసగా బాసికాలు, కన్యాదానం, సుముహూర్తం అంటే జీలకర్ర బెల్లం, మంగళసూత్ర ధారణ, తలంబ్రాలు మాలా పరివర్తనం, వీటన్నిటిని ఒకదాని తర్వాత ఒకటి జరిపించారు. ఇద్దరు వశిష్ఠులు అక్కడ ఆసీనులై ఉన్న ప్రతి సంఘటనని వివరిస్తూవుంటే, క్రిందటి యుగాలలో జరిగిన, సీతారాముల, శివపార్వతుల, లక్ష్మీనారాయణల కళ్యాణాన్ని తలపింపచేసే అలివేలుమంగా భరద్వాజుల కళ్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వీక్షించి భక్త బృందమంతా ఆనంద పరవశులైనారు. తర్వాత మహానివేదన సమర్పించి శ్రీమతి వేదమ్మగారు, శ్రీమతి లయమ్మగారు, మంగళహారతులను ఆలపించగా శ్రీ ద్వారక బాబుగారు హారతిని సమర్పించారు. అంతటితో ఆ దివ్య భవ్య మంగళ లీలా కళ్యాణ మహోత్సవం పూర్తయింది. ఇక భక్తులందరూ ఒక్కొక్కరుగా నూతన వధూవరులకు ప్రణామాలు చేసుకుని, ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందు ఆరగించడానికి తరలి వెళ్లారు.



ఆరోజు సాయంత్రం నూతన వధూవరులకు వినోద కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఒంగోలు నళినీప్రియ కూచిపూడి బృందం వారిచే" శ్రీ శిరిడీ సాయి దివ్య చరితము" నృత్య రూపకం ప్రదర్శించారు. అంతటితో 6వ తేదీ కల్యాణోత్సవం ముగిసింది.

## 7వ తేది శ్రీ సాయిమాస్టర్ నిత్య సత్యవ్రతం

పూజ్య గురుదంపతుల స్వర్ణోత్సవ లీలా కళ్యాణంలో భాగంగా ఏడో తేదీ ఉదయం నిత్య సేవల అనంతరం పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లిచే స్వయంగా కూర్చబడిన 'శ్రీ సాయిమాస్టర్ నిత్య సత్యవ్రతం' ప్రారంభమైంది. శ్రీ శ్రీకాంత్ గారు, శ్రీమతి వేదమ్మగారితో పాటు, దాదాపు 50మంది వరకు ఈ వ్రతంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వ్రతకథగా, శ్రీ సాయినాథుడు చేసిన అనేక లీలల్లో 29 లీలలను, శ్రీ భరద్వాజ గురుదేవులు చేసిన లీలలలో 29 లీలలను కలిపి కూర్చడం జరిగింది. శ్రీమతి వేదమ్మగారు, పూజ్యశ్రీ అమ్మగారు చేసిన లీలలలో 29 లీలలను కూడా ఆరోజు వ్రతకథలో జోడించారు. వ్రత విధానం కొంచెం పెద్దది కావడం వల్ల, ఒకింత ఆలస్యమైనా, శ్రీ ద్వారక బాబుగారి పర్యవేక్షణలో, ప్రశాంతంగా శ్రద్ధాభక్తులతో ఆచరించబడి, దిగ్విజయంగా పూర్తి అయ్యింది.

సాయంత్రం, 'శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ గుంటూరు వారు, "గోదా కల్యాణం" అనే నృత్య రూపకం ప్రదర్శించారు. అంతటితో ఆరోజు కార్యక్రమాలకు స్వస్తి పలికారు.

## 8వ తేదీ మరియు 9వ తేదీ కార్యక్రమాలు

స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఎనిమిదవ తేదీ ఉదయం నిత్య సేవల అనంతరం, పూజ్య భరద్వాజ గురుదేవులచే విరచితమైన, 'ఏది నిజం?' 'మతమెందుకు?' మరియు 'శ్రీ సాయినాథ ప్రబోధామృతం' గ్రంథాలను సమన్వయం చేస్తూ గురుపుత్రులు శ్రీ ద్వారకానాథ్ జ్ఞానేశ్వర్ గారు సత్సంగం చేశారు. సాయంత్రం శ్రీమతి జె. బాలార్కగారిచే కర్ణాటక సంగీత గాత్రకచేరీ కార్యక్రమం జరిగింది.

మర్నాడు 9వ తేదీ ఆదివారం ఉదయం దివ్యజనని



సన్నిధిలో నిత్య సేవల అనంతరం, గురుపుత్రులు శ్రీ ద్వారకానాథ్ గారిచే 'నిత్యజీవితంలో సాధన' అనే అంశంపై సత్సంగం జరిగింది. ఆ సత్సంగానికి హాజరైన వారందరూ, ఉత్సాహంగా చర్చలో పాల్గొని, వారి సందేహాలని తీర్చుకుంటూ, భావాలను పంచుకుంటుంటే దాదాపు సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. అంతటితో ఉత్సవ కార్యక్రమాలకి ముగింపు పలికారు.

ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా, గురుదంపతుల లీలా కళ్యాణ మహోత్సవం తిథి ప్రకారం మాఘ బహుళ నవమి నాడు, అనగా, ఫిబ్రవరి 22వ తేదీన, హైదరాబాదు, కావలి, చీరాల, పామర్రు, విద్యానగరు, గుడివాడ మొదలైన అనేక ప్రాంతాలలో భక్తులు ఎంతో వైభవంగా జరుపుకున్నారు. అంతేకాక, 50సంవత్సరాల క్రితం గురుదంపతుల కళ్యాణం జరిగిన ప్రదేశమైన బనగానపల్లెలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో గురు కుటుంబం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఈ కళ్యాణం జరిగింది. ఇవేకాక అనేకమంది తమ తమ గృహాలలో చుట్టూ పక్కల వారితో కలిసి కళ్యాణాన్ని జరుపుకున్నారు. తిరిగి వారందరూ తేదీ ప్రకారం దివ్యజనని సన్నిధానంలో జరిగిన లీలా కళ్యాణానికి తరలి వచ్చారు.

ఇంతటి వైభవోపేతమైన, భక్తి ముక్తి ప్రదమైన గురుదంపతుల కళ్యాణాన్ని, మానవ మాత్రులేకాక కాక సమస్త ప్రాణికోటి తిలకించి, పులకించి, పరవశించి, తరించిందనటంలో ఏమాత్రం సందేహం లేదు. అందులో మనమందరం భాగస్వాములు కావటం శ్రీ సాయినాథుని యొక్క, మహాత్ములందరి యొక్క, పూజ్య గురుదంపతుల యొక్క కృపాశీస్సులకు నిదర్శనం!!

జై సాయి మాస్టర్!!

# ద్వారకామాయి అనుభవమండపము

**శ్రీ జుబ్బురు చెన్నారావు**

మాది ఖమ్మం జిల్లా కందుకూరు. ఆ ఊర్లో 10వ తరగతి వరకు చదివాను. నేను ఏడవ తరగతి చదువుతున్నప్పుడే శిరిడి సాయినాథులవారి మీద గురి ఏర్పడింది. ఒకసారి మాకు తెలుగు బోధించే ఉపాధ్యాయుడు, నాకు సాయిబాబా మాసపత్రిక యిచ్చారు. దాంట్లో ఒక వ్యాసం నన్ను బాగా ఆకట్టుకుంది. 'ఒక చెట్టు కాయ ఎలాగైతే పరిపక్వత చెంది పండు అయ్యి రాలిపోతుందో, బాబాని నమ్ముకున్న వాళ్ళు అదే విధంగా పక్వత చెందుతారు' అన్న భావన ఆ వ్యాసంలో వుంది. అది చదివాక ఆ చిన్న వయసులోనే నాకు 'బాబాని ఆశ్రయించాలి' అన్న బీజం పడింది.

నేను పదవ తరగతి చదివేటప్పుడు సాయంత్రం సమయంలో ట్యూషన్ కి వెళ్లేవాడిని. వెళ్లేటప్పుడు వెలుతురుగా వున్నా, తిరిగి వచ్చేసరికి చీకటి పడేది. బాగా పల్లెటూరు కావడం వల్ల వీధి దీపాలు సరిగా వుండేవి కాదు, మధ్యలో అంతా తోటలు, చెట్లు వుండేవి. పాములు కూడా తిరుగుతూ వుండేవి. నాకు చాలా భయమేసేది. అలాగే ఒకరోజు ఇంటికి వెళుతూ వుంటే ఒక పిచ్చి పిల్ల ఎదురయింది. ఆమెని చూసి ఆ చీకట్లో ఝుడుసుకుని, ఒకరి ఇంటి పిట్టగోడ దూకి, వాళ్ళ ఇంట్లోకి వెళ్లిపోయాను. తర్వాత రెండు రోజులు బాగా జ్వరం వచ్చింది. ఇదంతా చూసి మా నాన్న తిరిగి వచ్చేటప్పుడు నాకు తోడు వచ్చేవారు. కానీ, పగలంతా పొలం పని చేసినందు వల్ల, నేను చదువుకుంటూ వుంటే బయట కూర్చుని నిద్రపోయేవారు. ఇలా మా నాన్నని ప్రతిరోజు ఇబ్బంది పెట్టడం నాకు బాధనిపించి, ఆయనని రావద్దని చెప్పి, ఈ సమస్యని పరిష్కరించమని సాయినాథులవారిని ప్రార్థించాను. చిత్రంగా ఒకరోజు ఒక కుక్క నాతో పాటే నాకు తోడుగా మా ఇంటివరకు వచ్చింది. అలాగే ప్రతి రోజూ ట్యూషన్ అయ్యేసమయానికి బైట నిలబడి వుండేది. అలా ప్రతిరోజూ వచ్చేది. తర్వాత అది పిల్లల్ని పెట్టింది, ఆ పిల్లలు కూడా నాకు తోడుగా ఇంటివరకూ వచ్చేవి. అలా నా పదవ తరగతి పూర్తయ్యే వరకు జరిగింది. బాబాని ప్రార్థన చేస్తే నాకు ఎంత గొప్ప తోడు ఇచ్చి పంపించారో కదా అని ఇప్పటికీ నా మనసు కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది.


కళాశాల చదువు కోసం సత్తుపల్లిలో హాస్టల్లో చేరాను. మా తల్లిదండ్రులకు నేనొక్కడినే సంతానం. నాకు ఇంటి మీద బాగా బెంగగా వుండి తరచూ ఇంటికి వెళుతూ వుండేవాడిని. అలాగే ఒకసారి ఇంటికి వచ్చినప్పుడు మా అమ్మకి ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో మా ఇంటి పక్కనున్న చెరువు నుంచి విభూది రేఖలతో జటాధారి అయిన ఒక ఆజానుబాహుడు బయటకు వచ్చి, క్రమేపీ సాయిబాబాగామారి మా ఇంటికి వచ్చి నా మంచం చుట్టూ మూడుసార్లు తిరిగి, మా అమ్మతో, "రేపటి నుంచి చదువుకోడానికి వెళతాడులే, బెంగ పెట్టుకోడు" అని చెప్పారట. తర్వాత నుంచి నాకు బెంగ, భయం ఇవన్నీ మచ్చుకైనా లేకుండా పోయాయి. ఇది 1996 సంవత్సరంలో జరిగిన సంఘటన! నేను తరచుగా ఆ ఊర్లో వున్న బాబా

గుడికి వెడుతుందేవాడిని.

నేను B.Sc. చదువుతున్నప్పుడు శ్రీ సాయిబాబా చరిత్ర పారాయణ బాగా చేసుకునేవాడిని. అప్పుడు నాకు కొన్ని స్వప్న దర్శనాలు వచ్చాయి. ఒకసారి స్వప్నంలో బాబా నాకు ఒక ఇల్లు చూపించి, "వారి ఇంట్లో నా చిత్రపటం వుంది, నువ్వు వెళ్లి తెచ్చుకో" అని చెప్పారు. అది బాబా చావడి ఉత్సవం చిత్రపటం. బాబావారు చూపించిన ఇల్లు మాకు దగ్గరలోనే వుంటుంది. నేను వారింటికి వెళ్ళి, మాటల మధ్యలో "ఆ పటం చాలా బాగుంది నాకు ఇస్తారా" అని అడిగాను. అప్పుడు వాళ్లు, "మేమే ఈ పటం ఎవరికైనా ఇద్దామని అనుకుంటున్నాం, చక్కగా తీసుకెళ్లండి" అని నాకు ఇచ్చారు. నాకు ఈ సంఘటన చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది.

B.Ed. చెయ్యడానికి కర్నాటక వెళ్ళాను. అప్పుడు గురుపూర్ణిమ వచ్చింది. కానీ ఆ సంగతి నాకు గుర్తులేదు. ఆ రోజు మధ్యాహ్నం కళాశాల నించి వచ్చి పడుకున్నాను. అప్పుడు ఒక స్వప్నం వచ్చింది. మాఇంట్లో వున్న కేలండర్ నించి, చందమామ ఆకారం బైటికి వచ్చింది. ఎదురుగా శిరిడీలో బాబా వారి సమాధి దర్శనం అయ్యింది. వెంటనే మెలకువ వచ్చింది. లేచి కేలండర్ చూస్తే ఆరోజు గురుపూర్ణిమ అని వుంది. మర్చిపోయిన ఆ పర్వదినాన్ని నాకు గుర్తుచేసిన శ్రీ సాయినాథులవారికి మనసారా కృతజ్ఞతలు చెప్పుకుని, కొద్ది దూరంలో వున్న బాబా గుడికి వెళ్ళి దర్శనం చేసుకున్నాను.

చదువు పూర్తయ్యాక కందుకూరులోనే లెక్కలు బోధించడానికి విద్యా వాలంటీర్ గా ఉద్యోగం చేస్తూ, తర్వాత వివాహం చేసుకొన్నాను. 2004లో ప్రమాదం జరిగి కుడి కాలు విరిగి, 40 రోజులు మంచం మీద వున్నాను. కోలుకున్నాక, హైదరాబాదు లో మెడికల్ ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరాను. మళ్ళీ 2018లో ప్రమాదం జరిగి, యెడమ కాలు విరిగింది. అప్పుడు కూడా 40 రోజులు కదలకుండా విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. అప్పుడు ఒకరోజు నాకు, పదవతరగతి చదివేటప్పుడు రాత్రి సమయంలో సహాయం చేసిన కుక్క గుర్తుకు వచ్చింది. ఒక జంతువు అంత ఉపకారం చేసినప్పుడు, మనిషినై వుండి ఏదైనా ఇతరులకి ఉపయోగకరమైన పని చెయ్యలేనా అనిపించింది. దానికోసం ఆ సమయాన్ని



సద్వినియోగం చేయాలనిపించింది.

యూ ట్యూబ్ సహాయంతో ఈ కాలానికి అవసరమైన, వైదిక గణితం(vedic maths) నేర్చుకుని, సులభతరమైన పద్ధతిలో ఎలా నేర్పించాలో సాధన చేశాను. ఎందుకంటే, నాకు చిన్నప్పుడు లెక్కలంటే చాలా భయంగా వుండేది. నాలాగే చాలామంది లెక్కలు అంటే భయపడే వాళ్ళని చూసాను కనుక, అలాంటి పిల్లలందరికీ భయం లేకుండా లెక్కలు నేర్ప గలిగితే, చాలామంది విద్యార్థులు హాయిగా వుంటారు కదా అనిపించి, నేర్చుకున్నాను. ఇదంతా నా గొప్పతనం కాదు. నా మనసులో ఉపయోగపడాలి అన్నదానికి భగవంతుడు చూపించిన మార్గమేమో అనిపిస్తుంది. మొత్తానికి నేను కోలుకున్నాక, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శని ఆదివారాల్లో వైదిక గణితం ఉచితంగా చెప్పేవాడిని. మిగిలిన రోజుల్లో నా ఉద్యోగం చేసుకునే వాడిని. తరవాత కొంతకాలానికి సొంతంగా వైదిక గణితం చెప్పే సంస్థని ప్రారంభించాను. కానీ దురదృష్టవశాత్తు కొవిడ్ రావడం వల్ల, దానిని మూసివేయవలసి వచ్చింది. తరవాత ఒక ప్రసార మాధ్యమంలో చేరాను. అయితే ఎప్పటికైనా యూట్యూబ్ ఛానల్ ద్వారా వైదిక గణితం అందరికీ ఉచితంగా నేర్పించాలి అన్నది నా ఉద్దేశం. అది సమర్థ సద్గురు సాయినాథుని ఆశీస్సుల వల్ల మాత్రమే సఫలీకృతం అవుతుందని నా ప్రగాఢ విశ్వాసం.

అనుక్షణం నా చేయిపట్టుకుని నడిపిస్తున్న సమర్థసద్గురు శిరిడీ సాయినాథుల వారికి కృతజ్ఞతా పూర్వక సాష్టాంగ ప్రణామములు.●

# ఆచార్యుని అద్భుత లీలలు

*డాక్టర్ ప్రసాదరావు, ఒంగోలు*

ఒంగోలు వాస్తవ్యులు డాక్టర్ ప్రసాదరావుగారు పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ తో వారి అనుభవాలను, అనుభూతులను ఈ విధంగా తెలియ చేస్తున్నారు...

నాకు మొదట్లో దేవుడంటే నమ్మకం ఉండేది కాదు. నాలో ఎక్కువ కమ్యూనిస్టు భావాలు ఉండేవి. అలాంటి రోజుల్లో బాబాగారు అంటే నాకు చాలా ఇష్టం ఏర్పడింది. కారణం వారు భగవంతుడు అని కాదు. కమ్యూనిస్టులు మానవులందరినీ పేద, ధనిక భేదం లేకుండా సమానంగా చూస్తారు, ప్రేమిస్తారు. శ్రీ శిరిడీ సాయినాథులవారు గొప్ప కమ్యూనిస్టు అని నా భావన. వారు సామాన్య మానవులనే కాకుండా పశుపక్ష్యాదులను కూడా అదే విధంగా ప్రేమించేవారు. అందువల్ల వారంటే నాకు ఇష్టం ఏర్పడింది.

నేను, పూజ్యశ్రీ మాస్టరుగారు, వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్నాం. అప్పుడు ముఖ పరిచయం కూడా లేదు. నాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి మూడు నాలుగు సంవత్సరములు వయస్సు తేడా ఉండొచ్చు. నాకు ఇప్పుడు 82 సంవత్సరాలు. వారు విద్యానగర్ లో ఉన్న రోజుల నుంచి, వారి వివాహం కాకముందు నుంచి నాకు తెలుసు. నేను M.B.B.S పూర్తిచేసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసాను. అప్పుడప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఒంగోలు వచ్చి వెళుతుంటారని తెలిసింది. కానీ నాకు ముఖ పరిచయం లేదు. నేను ఒంగోలులో ఆసుపత్రి కడదామన్న ఉద్దేశంతో నాలుగు చోట్ల స్థలాలు కొన్నాను. ఆ నాలుగు స్థలాలకి సంబంధించి కొంత వివాదం ఉండేది. అది నాకు చాలా ఇబ్బందికరంగా మారింది. అప్పుడు శ్రీ సాయినాథుల వారితో," అందరూ నిన్ను దేవుడు అంటున్నారు, నాకు మాత్రం నువ్వు మంచి కమ్యూనిస్టు అన్న భావం ఉంది. నువ్వు దేవుడివే అయితే నా స్థల వివాదాల్లో నాకు ఒక మార్గం చూపించు" అని చెప్పుకున్నాను. కొన్నాళ్ళకి పూజ్యశ్రీ మాస్టరుగారు ఒంగోలు వచ్చినప్పుడు మేమిద్దరం కలవడం జరిగింది. నాతో వారు "మీకేవో సమస్యలు ఉన్నాయట" అన్నారు. నేను చాలా ఆశ్చర్యపోయాను, ఈయనకి ఎలా తెలిసిందని. కానీ ఆయనని ఏమీ అడగకుండా, స్థల వివాదం గురించి వివరించాను. "సరే అయితే, వెళ్లి స్థలాలు చూద్దాం" అన్నారు. నాకున్న నాలుగు స్థలాల్లో, నేను ఆసుపత్రి కడదామనుకున్న స్థలం తప్పించి, మిగతా మూడు స్థలాల దగ్గరికి వారిని తీసుకువెళ్లాను. వారు సిగరెట్ తాగుతూ ఒక్కొక్క స్థలం చూసి "ఇది కాదు ఇక్కడ వద్దు" అని చెప్పారు. చివరికి నేను అనుకున్న స్థలాన్ని చూపించాను. "ఇది చాలా ఎక్సలెంట్ గా ఉంది, ఇక్కడ తప్పకుండా కట్టండి" అని చెప్పారు. అలా వారు చెప్పిన కొన్ని రోజులకు, ఆస్థలానికి సంబంధించిన సమస్యలన్నీ తొలగిపోయాయి. తరవాత ఆ స్థలంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాము. తర్వాత నాకు అర్థమైన విషయం ఏమిటంటే పూజ్యశ్రీ మాస్టరుగారికి, బాబాగారికి భేదం లేదు. వారిద్దరూ ఒకటే అవ్వడం వల్లే, నేను బాబాగారితో చెప్పుకున్న విషయం పూజ్యశ్రీ మాస్టరుగారు, వారంతట వారే నన్ను అడిగారని.. శంకుస్థాపన వారి


చేతుల మీదుగానే జరిపించాను. అప్పటినుంచి వారంటే నాకు విపరీతమైన గౌరవం మర్యాదలు ఏర్పడ్డాయి. ఇంతకుముందు సరదాగా వారితో పాటు నేను కూడా సిగరెట్టు కాల్చేవాడిని, తర్వాత వారి ముందు సిగరెట్ తాగడం మానేసాను. కాలంతరంలో వారు పూర్తిగా ఒంగోలులో స్థిరపడ్డారు. నేను వైద్య వృత్తిలో ఉండడం వల్ల అప్పుడప్పుడు మాత్రమే కలిసే అవకాశం ఉండేది.

ఒకసారి నేను సుధీంద్ర బాబుగారి దర్శనానికి వెళతానన్న విషయం, పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్పి వెడదామని వారి దర్శనానికి వచ్చాను. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం నాకు కాలేదు. సరేనని ఉండ్రాజవరం వెళ్ళాను. సాయంత్రం 6 గంటల సమయంలో సుధీంద్ర బాబుగారికి ఆప్తులైన ఒక డాక్టరుగారితో కలిసి వారి ఇంటికి వెళ్లాను. అంతకుముందే ఏదో పనిమీద బయటకు వెళ్లారని తెలిసింది. నాకు, మరునాడు ఉదయం ఏడు గంటలకు అక్కడ నుంచి రైలు ఉంది. నేను ఆ రాత్రంతా వారి కోసం ఎదురు చూస్తూనే ఉన్నాను కానీ వారు రాలేదు. నాకు అప్పుడు అర్థం అయింది, పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం అయిఉంటే, వీరి దర్శనం లభించేదని.

1989 వ సంవత్సరం, ఏప్రిల్ 11వ తేదీ సాయంత్రం వారికి ఒంట్లో బాగోలేదని తెలిసి, నేను మాస్టరుగారి ఇంటికి వెళ్లి పరీక్ష చేసి, వారికి గుండె నొప్పి అని నిర్ధారణ చేశాను. ఆసుపత్రికి వచ్చి చేరమని అభ్యర్థించాను. వారు నిరాకరించారు. సరే, మందులు వాడమని రాసిచ్చాను. ఇంటికి వచ్చాక కూడా రాత్రి పది గంటలకి మళ్ళీ కొన్ని మందులు పంపించాను. మరునాడు ఉదయం అదే వీధిలో ఉంటున్న మా మేనకోడలు నాకు ఫోను చేసి, “పూజ్యశ్రీ మాస్టరు గారి ఇంటిముందు చాలా మంది జనాలు ఉన్నారు. ఏమైందో తెలియడం లేదు” అని చెప్పింది.. ఆ సమయానికి నేను ఒంగోలు పక్కనే ఉన్న చిన్న ఊర్లో సర్జరీ చేయడానికి వెళ్లాను. నేను అక్కడ పని పూర్తి చేసుకుని పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వచ్చేసరికి, ఆయన శరీరం వదిలేశారు.

తర్వాత తెలిసింది నేను ఇచ్చిన మందులేవి వాడలేదని. ఆసుపత్రికి రమ్మంటే రాకపోవడం, మందులు వాడకపోవడం, వారు వెళ్లిపోవడానికి నిర్ణయించుకున్నారని నాకు అర్థం అయింది. ఇక ఎవరు మాత్రం చేసేది ఏముంది?

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి ఐన, వారం పది రోజులకు వారి శిష్యుడు కోటిరెడ్డిగారు, నా దగ్గరకు వచ్చారు. మేమిద్దరం కాసేపు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి మాట్లాడుకున్నాము. ‘ఇప్పుడు మాస్టరుగారు వారి బాధ్యతలు పూర్తి కాకుండానే శరీరం వదిలేయడం ధర్మం కాదేమో! పూజ్యశ్రీ అమ్మగారినీ, చిన్నపిల్లలనీ



వదిలిపెట్టి ఇలా వెళ్ళిపోతే, వాళ్ళ భవిష్యత్తు సంగతేమిటి’ అని ఏదో మాట్లాడుకున్నాం! మరునాడు మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్నప్పుడు ఒక స్వప్న వచ్చింది. అందులో,,,పూజ్యశ్రీ మాస్టరు గారు కూర్చుని ఉంటే, నేను వారికి నమస్కారం చేసుకుని, ‘మాస్టరుగారూ బాగున్నారా! ఏం చేస్తున్నారు?’ అని అడిగాను. ”ఏం చేస్తాను? పిల్లలకు పాఠాలు చెప్తున్నాను., ఇది నా బాధ్యత కదా!” అన్నారు. వారి పక్కనే వేదమ్మ, ద్వారక బాబు కూర్చున్నారు. ఒక్కసారి నిద్ర నించి తుళ్ళిపడి లేచి కూర్చున్నాను. సర్వజ్ఞులైన పూజ్యశ్రీ మాస్టరుగారు, ఇలలో అనుకున్నది కలలో నాకు చూపించారు.

జనన మరణాలను వారి అధీనంలో ఉంచుకున్న పరమ యోగులు పూజ్యశ్రీ మాస్టరుగారు. వారు ఈ భూమి మీదకు రావడం తిరిగి నిష్క్రమించడం అంతా వారి ప్రణాళిక ప్రకారమే జరిగింది. అందరికీ ప్రేమను పంచుతూ, సాయి బాటలో అందరినీ నడిపిస్తూ, ఎంతోమంది సన్మార్గంలో జీవించడానికి కారకులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి పాదపద్మములకు అనంత కోటి ప్రణామములు సమర్పించుకుంటున్నాను. ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |


**BOOKS IN ENGLISH**


| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |










Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



లీలా కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకలు - 2025